# అభ్యుదయం

The Pride of Telugu national daily

RNI: TEL TEL /2019/12836





Wanted Reporters

తెలుగు రాష్ట్రాల్లో నియోజక వర్గాల వారిగా విలేఖరులు కావలెను

తెలంగాణ :- 9700026263
ఆంధ్రప్రదేశ్:- 9885426263



పబ్లిషర్ :ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ మంగళవారం 22- 9- 2026 సంపుటి : 6 సంచిక : 223 ఎడిటర్ : ఆనంద్ రావు పేజీలు : 8 వెల : 3-00


# వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి గ్రీన్ చానల్‌లో నిధులు మంజూరు

## గ్రీన్‌చానల్లో నిధులిస్తున్నా పనులు వేగంగా జరగట్లేదేం!?

## రాబోయే నెల రోజులూ 24 గంటలూ పని చేయాల్సిందే

## వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై సీఎం రేవంత్ సమీక్ష



హైదరాబాద్, వరంగల్ మెడికల్, **అభ్యుదయం** వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి గ్రీన్ చానల్‌లో నిధులు మంజూరు చేస్తున్నా పనులు వేగంగా ఎందుకు జరగడం లేదని అధికారులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే 30 రోజులూ 24 గంటలూ పనులు జరగాలని, ఆ మేరకు వర్క్ షెడ్యూల్ తయారు చేసుకుని ముందుకు వెళ్లాలని నిర్దేశించారు.

వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణంపై సోమవారం రాత్రి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎంవో అధికారులు నిరంతరం క్షేత్రస్థాయికి వెళ్లి సమీక్ష చేయాలని, ప్రత్యేక అధికారులను నియమించి పనులను పర్యవేక్షించాలని చెప్పారు. ప్రతి పనికి ఒక ప్రత్యేక అధికారికి బాధ్యత అప్పగించాలని, ఇక నుంచి ప్రతి రోజు కలెక్టర్ ఆస్పత్రి పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు.సనత్ నగర్ టిమ్స్ తరహాలో వరంగల్‌లోనూ త్వరలోనే ఓపీ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని, ఆస్పత్రి చుట్టూ మంచి వాతావరణం ఉండేలా పరిసరాల్ని తీర్చిదిద్దాలని సూచించారు. అలాగే, సనత్ నగర్ టిమ్స్‌లో తక్షణమే స్టాఫ్ క్వార్టర్స్ పనులు ప్రారంభం కావాలన్నారు. ఆస్పత్రి నిర్వహణను ఏజెన్సీకి అప్పగించాలని నిర్దేశించారు. వరంగల్‌లో భూగర్భ డ్రైనేజీని భారీ నిధులతో నిర్మిస్తున్నందున పనులను పకడ్బందీగా చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

వరంగల్ అభివృద్ధి పనులపై సోమవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. వరంగల్ ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రధానంగా దృష్టి పెట్టాలన్నారు. ఖమ్మం, వరంగల్, కరీంనగర్‌లను కలుపుతూ రోడ్ కనెక్టివిటీ ఏర్పాటు చేయాలని, విమానాశ్రయం వరకూ కనెక్టివిటీ ఉండాలని సూచించారు.

హైదరాబాద్ తరహాలో వరంగల్‌ను అభివృద్ధి చేయాలని, టూరిజంపై దృష్టి సారించాలని నిర్దేశించారు. విమానాశ్రయం ప్రారంభమయ్యాక భద్రకాళి, రామప్ప ఆలయాలకు భక్తుల సంఖ్య పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అన్ని సౌకర్యాలతో పెద్ద బస్ టెర్మినల్ కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

# ఆహ్లాదం.. ఆరోగ్య నిలయాలుగా గ్రామీణ చెరువులు

-ఫక్రుద్దీన్ పాలెంలో సుందరీకరించిన మైసమ్మ చెరువును ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



- రాష్ట్రవ్యాప్తంగా రూ. 50 కోట్లతో 105 చెరువుల ఆధునీకరణ
- పిఠాపురం నియోజకవర్గంలో రూ. 6 కోట్లతో 11 చెరువుల సుందరీకరణ
- పిఠాపురంలో 'పీఠికాపుర వనం' ప్రారంభం
- డంపింగ్‌యార్డు నుంచి ఆహ్లాదకరమైన హరిత ప్రదేశంగా రూపాంతరం

# సిరిసిల్ల, సిద్దిపేటలపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి

- భారీ సభలకు సిద్ధమవుతున్న రేవంత్
- 30న సిరిసిల్లలో ముఖ్యమంత్రి సభ
- పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్న సీఎం
- అక్టోబరు మొదటి వారంలో సిద్దిపేటలో సభ




2లో


# చేతగానితనాన్ని ప్రశ్నిస్తే.. అరెస్టులు చేసి, నిర్బంధిస్తారా?



- కాంగ్రెస్ పాలనా వైఫల్యాన్ని ప్రశ్నిస్తే అరెస్టులా?
- పాలమూరుకు ద్రోహం చేస్తున్న సీఎం రేవంత్
- జూరాల నీళ్లడిగిన రైతులను, బీఆర్ఎస్ నేతలను అరెస్టుచేయడాన్ని ఖండిస్తున్నాం: హరీశ్

హైదరాబాద్, **అభ్యుదయం**

కృష్ణా జలాలను శ్రీశైలం నుంచి 738 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెన్నా బేసిన్ ద్వారా కుప్పం వరకూ తరలిస్తుంటే.. పక్కనేఉన్న పాలమూరుకు ఎందుకు తరలించడం లేదని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉప నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనా వైఫల్యాన్ని, పాలకుల చేతగానితనాన్ని ప్రశ్నిస్తే.. అరెస్టులు చేసి, నిర్బంధిస్తారా? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సోమవారం ఎక్స్ వేదికగా ఆయన నిలదీశారు. "గడిచిన రెండున్నరేళ్లూ కృష్ణానదిలో పుష్కలంగా నీళ్లు పారినా మోటర్లను ఎందుకు నడపలేదు? శ్రీశైలం నిండుకుండ


మిగతా 2లో





2లో


# ఉద్యమకారుడికి అండగా.. మాట నిలబెట్టుకున్న - కేటీఆర్.

కూకట్‌పల్లి షంషీగూడకు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు లక్ష్మణ్ ముదిరాజ్ (51) అడ్వాన్స్‌డ్ స్టేజ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న విషయం మాజీ కార్పొరేషన్ చైర్మన్ పాటిమీది జగన్ మోహన్ రావు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి

# ట్రంప్ వార్తలను ప్రసారం చేయం..

# అమెరికన్ టీవీ నెట్‌వర్క్‌ల నిర్ణయం



వాషింగ్టన్, **అభ్యుదయం**

సీఎన్ఎన్ వార్తా సంస్థను ఉమ్మడి(పూల్డ్) ప్రతినిధిగా వ్యవహరించడానికి వైట్ హౌస్ నిరాకరించడంతో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఉమ్మడి టీవీ కవరేజీని నిలిపివేయడానికి ప్రధాన అమెరికన్ టెలివిజన్ నెట్‌వర్క్‌లు సోమవారం అంగీకరించినట్టు ది న్యూయార్క్ టైమ్స్ తెలిపింది. ఫాక్స్ న్యూస్ వాషింగ్టన్ బ్యూరో చీఫ్ బ్రయాన్ బౌటన్ మీడియా ప్రతినిధుల బృందానికి(పూల్ మెంబర్స్) పంపిన ఒక సందేశం ద్వారా ఈ విషయాన్ని తెలియచేశారని టైమ్స్ పేర్కొంది.సోమవారం నుంచి అధ్యక్షుడికి సంబంధించిన పూల్ కవరేజ్(ఉమ్మడి మీడియా కవరేజ్) పరిధిలోకి వచ్చే కార్యక్రమాలను టీవీ పూల్ కవర్ చేయదని బౌగన్ పేర్కొన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా మరో పూల్ ఏర్పాటు కాదని ఆయన తెలిపారు. ఇతర పూల్ కవరేజ్ కార్యకలాపాలన్నీ యథావిధిగా కొనసాగుతాయని ఆయన తెలిపారు.



# అల్పపీడనం ప్రభావిత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- వంశధార, నాగావళి నదుల ప్రవాహాలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- వాగులు, కాజ్‌వేల వద్ద ప్రత్యేక నిఘా
- హోంమంత్రి అనిత


వివరాలు 2లో





2లో


# 1.12 కోట్ల మంది పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు

-సెప్టెంబరు 25న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం

-ప్రచార గోడ పత్రికను ఆవిష్కరించిన మంత్రి సత్యకుమార్ యాదవ్

# అభివృద్ధి కంటే కక్ష సాధింపులకే వైకాపా ప్రాధాన్యం

ఇవ్వాలని టీడీపీ శ్రేణులకు మంత్రి సూచించారు. వైకాపా నాయకులు గ్రామాల్లో పర్యటిస్తూ టీడీపీపై విమర్శలు చేయడం కాకుండా, తమ ఐదేళ్ల పాలనలో ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారో ప్రజలకు వివరించాలని తెలిపారు, వైకాపా పాలనలో టెక్కలి ప్రాంతంలో ప్రభుత్వ భూములు, ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన వ్యవహారాల్లో అవకతవకలు జరిగాయని అచ్చెన్నాయుడు ఆరోపించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న న్యాయపరమైన అంశాల్లో కౌంటర్లు దాఖలు చేసి కేసులను ముందుకు తీసుకెళు న్నామని చెప్పారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ విషయంలో ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదన్నారు.

**పోలీసు వ్యవస్థను రాజకీయ కక్షలకు ఉపయోగించం**

అధికారంలో ఉన్నామని పోలీసు వ్యవస్థను రాజకీయ కక్ష సాధింపులకు ఉపయోగించబోమని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. గతంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని కార్యకర్తలు తన దృష్టికి తీసుకొస్తున్నప్పటికీ, తాము అదే విధానాన్ని అనుసరించబో మన్నారు. వాళ్లు చేసిన తప్పులను మనం చేయడం వల్ల మనకు, వారికి తేడా ఏముంటుంది" అని మంత్రి పేర్కొన్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ ఉంటుందని, చట్టం తన పని తాను చేసుకునేలా ప్రభుత్వం వ్యవహరిస్తుందని తెలిపారు.

# అల్పపీడనం ప్రభావిత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అమరావతి, భీమోదయం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రాబోయే రెండు రోజుల్లో తీవ్రవాయుగుండంగా బలపడి దక్షిణ ఒడిశా – ఉత్తరాంధ్ర తీరాల వైపు పయనించే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఉన్నత స్థాయి అత్యవసర సమీక్ష నిర్వహించారు. ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్, ఇతర ఉన్నతాధికారులతో అత్యవసర టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన ముందస్తు భద్రతా చర్యలపై దిశానిర్దేశం చేశారు.తీవ్రవాయుగుండం ప్రభావంతో బుధ, గురువారాల్లో ఉత్తరాంధ్రలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హోంమంత్రి తెలిపారు. ఒడిశాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వంశధార, నాగావళి నదుల ప్రవాహాలపై ప్రత్యేక దృష్టి సారించాలని హోంమంత్రి సూచించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లను 24 గంటలూ అందుబాటులో ఉంచి, క్షేత్రస్థాయి అధికారులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా నిత్యావసరాలు, వైద్యం,ఇతర అత్యవసర సదుపాయాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తీరప్రాంత, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అవసరమైతే వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించాలని స్పష్టం చేశారు. పొంగిపొర్లే వాగులు, ప్రమాదకరమైన కాజ్‌వేలు, ముంపు ప్రాంతాల వద్ద తప్పనిసరిగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని హోంమంత్రి ఆదేశించారు. ప్రాణనష్టం జరగకుండా వాహనాలు, ప్రజల రాకపోకలను కట్టడి చేయాలని సూచించారు.

# ఉద్యమకారుడికి అండగా .. మాట నిలబెట్టుకున్న

తెలంగాణ వార్తలుతెలంగాణ ఉద్యమ సమయంలో చిన్న వయసు నుంచే తెలంగాణ తల్లి వేషధారణలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న లక్ష్మణ్ కుమార్తె చంద్రికతోపాటు కుటుంబ సభ్యులతో ఇటీవల కేటీఆర్ ఫోన్‌లో మాట్లాడి సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ భవన్‌లో లక్ష్మణ్ కుమార్తె, కుమారుడు కేటీఆర్‌ను కలిశారు. ఇప్పటికే బసవతారకం ఆసుపత్రిలో రెండు కీమోథెరపీలు పూర్తయ్యాయని తెలుసుకున్న కేటీఆర్ , తదుపరి చికిత్స గురించి ఆరా తీశారు.మెరుగైన వైద్యం కోసం అడ్వాన్స్‌డ్ ట్రీట్‌మెంట్ అందుబాటులో ఉన్న సింధు హాస్పిటల్‌కు కేటీఆర్ రిఫర్ చేశారు. ఉద్యమకారుల కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని కేటీఆర్ హామీ ఇచ్చారు. అలాగే ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ కార్పొరేషన్ చైర్మన్ పాటిమీది జగన్ మోహన్ రావులను ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్సకు అవసరమైన సహకారం అందించాలని కేటీఆర్ సూచించారు.

## చేతగానితనాన్ని ప్రశ్నిస్తే.. అరెస్టులు చేసి, నిర్బంధిస్తారా?

ఉన్నా రైతులకు నీళ్లు ఎత్తిపోసే ఆలోచన ఎందుకు చేయలేదు? కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్‌కు వదిలిపెట్టి తెలంగాణ రైతుల ప్రయోజనాలను ఎందుకు గాలికొదిలేశారో.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గానీ, నీళ్ల మంత్రి ఉత్తమ్ గానీ సమాధానం చెప్పాలి" అని ఆయన డిమాండ్ చేశారు.ప్రాజెక్టులను పడావు పెట్టి, రైతుల నోట్లో మట్టి కొట్టారని ధ్వజమెత్తారు. పాలమూరు బిడ్డనని చెప్పుకొనే రేవంత్‌రెడ్డి పాలమూరుకు, అక్కడి రైతులకు నమ్మక ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. జూరాల ఆయకట్టు పొలాలకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిరసన చేస్తున్న రైతులు, ఉమ్మడి పాలమూరు బీఆర్ఎస్ పార్టీ నేతలను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జూరాల ప్రాజెక్టును పోలీసులు పూర్తిగా దిగ్బంధించి, ఆనకట్ట పరిసరాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరించారని.. కనిపిస్తే అరెస్టులు చేస్తున్నారని ఆందోళన వెలిబుచ్చారు. "ఎందుకింత దౌర్జన్యం, రైతులు నీళ్లు అడుగుతుంటే, వాళ్ల చేతికి సంకెళ్లు వేస్తారా?" అని సీఎంను ప్రశ్నించారు. "నీళ్లను ఒడిసి పట్టకుండా, విడిచిపెట్టి తెలంగాణకు జల ద్రోహం చేస్తున్న మీరు తప్పుచేస్తే.. శిక్ష రైతులు అనుభవించాలా? రైతులంటే ఎందుకు అంత నిర్లక్ష్యం, వ్యవసాయం అంటే ఎందుకింత పట్టింపు లేని తనమ"ని నిలదీశారు.

# ఆహ్లాదం.. ఆరోగ్య నిలయాలుగా గ్రామీణ చెరువులు

పిఠాపురం, పిఠాపురం నియోజకవర్గ లోని ఫకృద్దీన్ పాలెం గ్రామంలో రూ. 73 లక్షల వ్యయంతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన మైసమ్మ చెరువు, వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ పార్కును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో చెరువులను కేవలం నీటి వనరులుగానే కాకుండా ప్రజలకు ఆహ్లాదం, ఆరోగ్యం అందించే సామాజిక వేదికలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో మైసమ్మ చెరువును నమూనాగా అభివృద్ధి చేశారు. పిఠాపురం నియోజకవర్గ పర్యటనలో భాగంగా సోమవారం మైసమ్మ చెరువును సందర్శించిన పవన్ కళ్యాణ్ వాకింగ్ ట్రాక్, ఓపెన్ ఎయిర్ జిమ్‌తోపాటు పిల్లల పార్కును ప్రారంభించారు. అలాగే నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి చేసిన మరో 11 చెరువులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కాకినాడ జిల్లా పరిధిలో అభివృద్ధి చేసిన 14 చెరువులకి సంబంధించిన గ్యాలరీని సందర్శించారు.

అనంతరం చెరువు గట్టు వెంబడి వాకింగ్ చేస్తూ, అక్కడ ఉన్న భారీ వృక్షాల వయసు, కొన్ని వృక్షాల శాస్త్రీయ నామం తదితర అంశాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువుల సుందరీకరణ గ్రామీణ ప్రజలకు విశ్రాంతి, వినోదం తోపాటు ఆరోగ్యాన్ని అందించడంలో ఈ చెరువులు దోహదపడతాయని తెలిపారు.

**చిన్నారులతో కలసి చిల్డ్రన్ పార్కు ప్రారంభోత్సవం:**

మోడల్ ప్రాజెక్టుగా తీర్చిదిద్దిన ఫకృద్దీన్ పాలెం మైసమ్మ చెరువు పరిసరాలను పచ్చటి మొక్కలతో అభివృద్ధి చేసి, గట్టును బలోపేతం చేశారు. అనంతరం గట్టుపై వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో నడక ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకునేలా ఈ ప్రణాళికను రూపొందించారు. మహిళలు, యువతతో పాటు వృద్ధులు కూడా వ్యాయామం చేసుకునేలా ఓపెన్ ఎయిర్ జిమ్‌ను, జాతీయ భావన పెంపొందించేలా జెండా స్థూపాన్ని ఏర్పాటు చేశారు. చెరువు కుడి వైపున పిల్లల కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన చిల్డ్రన్స్ పార్కును చిన్నారులతో కలసి ప్రారంభించారు. పార్కులో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. చిల్డ్రన్స్ పార్కులో ఆడుకుంటున్న చిన్నారులకు తినుబండారాలు, చాక్లెట్లు అందించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధిలో పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం, ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఫకృద్దీన్ పాలెం మైసమ్మ చెరువు భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాలకు మోడల్ నమూనాగా నిలవాలని ఆకాంక్షించారు.

ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా రూ. 50 కోట్ల వ్యయంతో 105 చెరువుల సుందరీకరణ పనులు చేపట్టారు. వీటిలో దాదాపు సగానికి పైగా పనులు పూర్తికాగా, మిగిలినవి పురోగతిలో ఉన్నాయి. ఈ నెలాఖరు నాటికి అన్ని చెరువుల సుందరీకరణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

**మైసమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు:**

అంతకుముందు ఎఫ్.కె. పాలెం మైసమ్మ చెరువు ప్రారంభోత్సవానికి ముందు గట్టుపై ఉన్న ఆలయంలో శ్రీ మైసమ్మ అమ్మవారిని పవన్ కళ్యాణ్ దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెరువు మధ్య భాగానికి వచ్చే విధంగా నూతనంగా నిర్మిస్తున్న నందీశ్వరుడి సహిత శివుని వి[illegible] పరిశీలించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఫకృద్దీన్ పాలెంలోని వినాయకుడి గుడిని సందర్శించారు.

చెరువు ప్రారంభోత్సవానికి విచ్చేసి ప్రజల వద్దకు వెళ్లి ప్రతి ఒక్కరినీ పవన్ కళ్యాణ్ ఆప్యాయంగా పలుకరించారు. ప్రజల నుంచి పలు సమస్యలపై వినతులు స్వీకరించారు.

## 1.12 కోట్ల మంది పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు

అమరావతి, భీమోదయం: సెప్టెంబరు 25న నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 1.12 కోట్ల మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ రూపొం దించిన ప్రచార గోడపత్రికను అధికారులతో కలిసి సోమవారం మంగళగిరిలోని ఏపీఐఐసీ వైద్య, ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలో మంత్రి ఆవిష్కరించారు. ఏడాదికి రెండుసార్లు నిర్వహించే నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా 2026 సెప్టెంబరు మలి విడతను ఈ నెల 25న నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఒకటి నుంచి ఐదేళ్ల వయసున్న పిల్లలతో పాటు 6 నుంచి 19 ఏళ్ల బాలబాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, హాస్టళ్లు, జూనియర్ కళాశాలలు, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, నర్సింగ్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులతో పాటు బడికి వెళ్లని పిల్లలకూ మాత్రలు అందేలా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ కోసం 1.24 కోట్ల ఆల్బెండజోల్ మాత్రలను సిద్ధం చేశారు. వీటిలో 1.12 కోట్ల మంది పిల్లలకు మాత్రలు అందించనున్నారు. రాష్ట్రంలో నేల ద్వారా వ్యాపించే నులిపురుగుల వ్యాప్తి ప్రస్తుతం 34 శాతానికి తగ్గింది. 2019లో ఎన్‌సీడీసీ గణాంకాల ప్రకారం ఇది 36 శాతంగా ఉంది. నులిపురుగుల నివారణకు 400 మి.గ్రా. ఆల్బెండజోల్ మాత్రలను వినియోగిస్తున్నారు. పిల్లలకు మరో అవకాశం కల్పించేందుకు అక్టోబరు 5న మాప్-అప్ డే నిర్వహించనున్నారు.

# గురువులపై దాడులు బరితెగింపే

దాడులకు పాల్పడటం మరింత దారుణమని సీఎం పేర్కొన్నారు. గురువులపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోం... చర్యలు తీసుకుంటాం అని స్పష్టం చేశారు. మీడియా ముసుగులో కుప్పంలో వైసీపీ అనుకూల రిపోర్టర్ ఉపాధ్యాయుడిపై దాడి చేశారన్న అంశాన్ని ప్రస్తావిస్తూ ఇలాంటి ఘటనలు ఎంతవరకు వెళ్లాయో అర్థం చేసుకోవచ్చన్నారు. ఆర్మీలో పనిచేసిన వ్యక్తి క్రీడా ప్రతిభ ఆధారంగా టీచర్ ఉద్యోగం పొందితే అతనిపైనా దాడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తమను ఫేక్ అంటూ అవమానించడాన్ని ప్రశ్నించినందుకు రౌడీలతో దాడులు చేయడం ఏమిటని ముఖ్యమంత్రి నిలదీశారు.

**డీఎస్సీకి ఇదే మా ట్రాక్ రికార్డు:**

తన హయాంలో నిర్వహించిన డీఎస్సీ నియామకాల్లో అవినీతికి, ప్రశ్నపత్రాల లీకేజీలకు తావులేదని సీఎం చంద్రబాబు తెలిపారు. ఎన్నో డీఎస్సీలు, ఏపీపీఎస్సీ పరీక్షలు నిర్వహించామని, ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేశామని చెప్పారు. తన పాలనా కాలంలో 14 సార్లు డీఎస్సీ నిర్వహించినట్లు తెలిపారు. చిన్న పొరపాటుకు కూడా తావులేకుండా నియామకాలు చేపట్టడమే తమ ట్రాక్ రికార్డు అని అన్నారు. మెగా డీఎస్సీ – – 2025 నియామక ప్రక్రియను అడ్డుకునేందుకు 355 పిటిషన్లు దాఖలయ్యాయని, అయినప్పటికీ చట్టబద్ధంగా, పారదర్శకంగా నియామకాలు పూర్తి చేశామని సీఎం తెలిపారు. నియామకాలు పూర్తై ఏడాది గడిచిన తర్వాత ఇప్పుడు లేనిపోని ఆరోపణలు చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. స్పోర్ట్స్ కోటా ద్వారా ఉద్యోగాలు పొందినవారిని గత ప్రభుత్వం జారీ చేసిన సర్టిఫికట్ల ఆధారంగా నియమించిన విషయాన్ని కూడా సీఎం ప్రస్తావించారు. క్రీడల్లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు ఇచ్చింది గత ప్రభుత్వమేనని, ఆ సర్టిఫికెట్ల ఆధారంగా ఉద్యోగాలు పొందిన వారిని ఇప్పుడు ఫేక్‌గా పేర్కొనడం విచిత్రంగా ఉందని అన్నారు.

**దుష్ప్రచారానికి టీచర్లే సమాధానం చెప్పారు:**

డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై వస్తున్న ఆరోపణలకు ఉపాధ్యాయులే వివిధ ప్రాంతాల్లో స్పందించారని సీఎం తెలిపారు. కర్నూలు కొండారెడ్డి బురుజు, విజయవాడలో అంబేద్కర్ విగ్రహం, విశాఖ సముద్రతీరం వద్ద తమ ఉద్యోగాలు ప్రతిభ, కష్టార్జితమని ఉపాధ్యాయులు స్పష్టం చేశారని చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికే వచ్చిన ఆరోపణలకు సమాధానాలు ఇచ్చిందని, ఇద్దరు మహిళా అధికారులు కూడా ఈ అంశంపై వివరంగా స్పందించారని తెలిపారు. ఆరోపణలు చేసే వారికి వాస్తవాలు తెలుసుకోవాలంటే అసెంబ్లీకి రావాలని సూచించారు. సాక్ష్యాధారాలతో సమాధానం చెబుతాం.. వాస్తవాలతో వివరిస్తామని, ఆధారాలతో అబద్ధాలాడే వారి బట్టలూడదీస్తాం అని సీఎం స్పష్టం చేశారు. నియామక ప్రక్రియపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే చట్టపరమైన మార్గాలను అనుసరించవచ్చని ముఖ్యమంత్రి అన్నారు. కోర్టులను ఆశ్రయించే అవకాశం ఉన్నప్పుడు ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. చట్టబద్ధంగా జరిగిన ప్రక్రియపై అవసరమైతే కోర్టులకు వెళ్లొచ్చు.. కానీ దాడులేంటి? ఉపాధ్యాయులపై రౌడీలను ఎగదోయడమేంటి? డీఎస్సీ నియామకాలపై రాజకీయ రౌడీయిజం చేస్తామంటే చూస్తూ ఊరుకోబోమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**రాజకీయ ముసుగులో రౌడీయిజాన్ని ఉపేక్షించం:**

2019--24 మధ్య రాష్ట్రంలో విధ్వంసకర పాలన సాగిందని చంద్రబాబు విమర్శించారు. అప్పటి పాలకులే రౌడీయిజానికి పాల్పడి, దౌర్జన్యాలకు దిగారని ఆరోపించారు.

కుప్పం వచ్చిన సందర్భాల్లో తనను కూడా ఇబ్బందులకు గురిచేసేందుకు గొడ్డలి పార్టీ నేతలు ప్రయత్నించారని గుర్తు...

# సిరిసిల్ల, సిద్దిపేటలపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి



హైదరాబాద్, సెప్టెంబరు 21 బీఆర్ఎస్ పార్టీకి కీలకమైన సిరిసిల్ల, సిద్దిపేటలపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ రెండు నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాలతో పాటుగా భారీ బహిరంగ సభలకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల నియోజకవర్గంలో ఈ నెల 30న నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. అక్టోబరు మొదటి వారంలో హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేటలో సీఎం సభ ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

ఈ రెండు సభలను విజయవంతం చేయడానికి ఏర్పాట్లు చేయాలని డీసీసీ అధ్యక్షులను టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ ఆదేశించినట్లు సమాచారం. ఇటీవల శాసనసభలో 22ఏపై చర్చ సందర్భంగా కేటీఆర్, హరీశ్‌లు భూ దోపిడీలకు పాల్పడ్డారంటూ సర్వే నంబర్లతో సహా రేవంత్‌రెడ్డి వివరాలు బయటపెట్టారు. ఈ క్రమంలో సిరిసిల్ల, సిద్దిపేటల్లో సీఎం బహిరంగ సభలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సిరిసిల్లలో బీఆర్ఎస్ నాయకులు 8 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని చెరబడితే.. తమ ప్రభుత్వం వచ్చాక కలెక్టర్ 2 వేల ఎకరాలు స్వాధీనం చేసుకున్నారని రేవంత్ చెప్పిన సంగతి తెలిసిందే. సిద్దిపేటలో హరీశ్ అసైన్డ్ భూములను ఆక్రమించుకున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో సిరిసిల్ల, సిద్దిపేట సభల్లో సీఎం రేవంత్.. ఈ భూముల వ్యవహారంపై ఎదురుదాడి చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# బంగారు ఆభరణాల కోసం మహిళ హత్య.. నిందితుడికి జీవిత ఖైదు

- రూ.7 వేల జరిమానా విధించిన నిజామాబాద్ కోర్టు
- బలమైన ఆధారాలతో నేరం నిరూపించిన ప్రాసిక్యూషన్
- దర్యాప్తు అధికారులను అభినందించిన సీపీ సాయి చైతన్య

నిజామాబాద్, సెప్టెంబర్ 21 (నారద): బంగారు ఆభరణాల కోసం మహిళను హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ నిజామాబాద్ నాలుగో అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి (ఫ్యామిలీ అండ్ ఉమెన్స్ కోర్టు) డి. దుర్గ ప్రసాద్ సోమవారం బహిరంగ న్యాయస్థానంలో తీర్పు వెలువరించారు.
నవీపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2025 నవంబర్ 25న నమోదైన హత్య కేసులో మోస్రా గ్రామం, వర్ని మండలానికి చెందిన కుమురం అలియాస్ పాండవాల సాగర్‌ను న్యాయస్థానం దోషిగా నిర్ధారించింది.

బంగారు ఆభరణాల కోసం హత్య

పోలీసులు, ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.. నిజామాబాద్ రూరల్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన ఆకుల అనంత అలియాస్ సోనీకి నిందితుడు బంధువు. దీంతో తరచూ ఆమె ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో ఆమె మెడలో ఉన్న బంగారు ఆభరణాలను గమనించి వాటిని అపహరించాలని భావించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. మృతురాలి తల్లి ఇంట్లో లేని సమయంలో నిందితుడు ఇంటికి వచ్చి అనంతను గొంతు నులిమి హత్య చేసి, అనంతరం ఆమె బంగారు ఆభరణాలను అపహరించినట్లు ప్రాసిక్యూషన్ కోర్టుకు తెలిపింది.
ఈ ఘటనపై నవీపేట్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 307/2025 నమోదు చేసి, బీఎన్ఎస్ సెక్షన్లు 103(1), 303(2) కింద దర్యాప్తు చేపట్టారు.

శాస్త్రీయ ఆధారాలతో దర్యాప్తు

నార్త్ రూరల్ సీఐపీ బి. శ్రీనివాస్, నవీపేట్ పోలీస్ సిబ్బంది సహకారంతో ఆధారాలను సేకరించి శాస్త్రీయ పద్ధతుల్లో దర్యాప్తు పూర్తి చేసి నిందితుడిపై ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్ సమర్పించిన ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిని దోషిగా నిర్ధారించింది.

జీవిత ఖైదు.. రూ.7 వేల జరిమానా

బీఎన్ఎస్ సెక్షన్ 103(1) కింద నిందితుడికి జీవిత



ఖైదుతో పాటు రూ.5 వేల జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పునిచ్చింది.

బీఎన్ఎస్ సెక్షన్ 303(2) కింద ఏడాది కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధించింది. ఈ జరిమానా చెల్లించని పక్షంలో ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధించింది. రెండు ప్రధాన శిక్షలు ఏకకాలంలో అమలవుతాయని న్యాయస్థానం పేర్కొంది. ఈ కేసులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. నీరజ ప్రాసిక్యూషన్ తరపున వాదించారు.

# మట్టి వినాయకుని పూజించాలి, పర్యావరణాన్ని పరిరక్షించాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



మందమర్రి టౌన్, సెప్టెంబర్ 21, నారద న్యూస్
వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకుడిని పూజించి, పర్యావరణాన్ని పరిరక్షించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. సోమవారం మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీపతి నగర్ లో అక్షర యూత్ గణేష్ మండలి వారు ఏర్పాటు చేసిన మట్టి వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ వినాయక చవితి విశిష్టతను కాపాడేందుకు అందరు సముష్టిగా కృషి చేయాలన్నారు. సహజ రంగులతో తయారుచేసిన మట్టి ప్రతిమలతో పర్యావరణ అనుకూల వినాయక చవితిని జరుపుకోవాలన్నారు. వినాయక విగ్రహాల తయారీకి వినియోగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ రంగుల ద్వారా వాయు, జల, నేల కాలుష్యం అవుతుందని, ఈ కాలుష్యాన్ని నియంత్రించే మట్టి వినాయకులను పూజించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మందమర్రి మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, అక్షర యూత్ గణేష్ మండలి సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించాలి

**ప్రతి వినతిపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సత్వర చర్యలు తీసుకోవాలి**
**అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు**



సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 21( నారద ):
ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, అర్హత మేరకు వేగవంతంగా పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్లు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు లు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమానికి హాజరైన అర్జీదారుల సమస్యలను ఆలకిస్తూ, ప్రతి దరఖాస్తును పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా ప్రతి ఫిర్యాదుకు సత్వర పరిష్కారం అందించాలని తెలిపారు. ప్రజావాణిలో మొత్తం 79 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిలో సంగారెడ్డి డివిజన్‌కు 20, నారాయణఖేడ్ డివిజన్‌కు 2, జహీరాబాద్ డివిజన్‌కు 2, కలెక్టరేట్‌కు 55 దరఖాస్తులు అందగా, అందోల్ డివిజన్‌కు ఎలాంటి వినతులు అందలేదని వెల్లడించారు. ప్రజావాణిలో ప్రధానంగా రెవిన్యూ, హౌసింగ్, పెన్షన్లు, పంచాయతీరాజ్, ఎంప్లాయిమెంట్, ఆర్టీసీ, ఎలక్ట్రిసిటీ, ఇరిగేషన్, మిషన్ భగీరథ గ్రిడ్, యూత్ వెల్ఫేర్, కోపరేటివ్, లేబర్, అగ్రికల్చర్, విద్య, వైద్య ఆరోగ్య శాఖ, డి ఆర్ డి ఓ, సర్వే ల్యాండ్ రికార్డ్స్, పోలీస్, ట్రైబల్ వెల్ఫేర్, మహిళా ,శిశు, వికలాంగులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, ఈ ఈ పి ఆర్, ఎక్సైజ్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ప్రజలు పాల్గొన్నారు.

# సీఎం సన్నిహితుడి ప్రవర్తనపై మహిళా వ్యాపారవేత్త కే శోభా రెడ్డి

రేవంత్ సర్కార్‌లో ఓ మహిళా ఎంటర్‌ప్రెన్యూర్ ఏకంగా సీఎం సన్నిహితుడి నుంచి ఎదురైన చేదు అనుభవాన్ని వెల్లడిస్తూ తన ఆవేదన వ్యక్తం చేసిందని తెలిసిందే. సీఎం సన్నిహితుల వేధింపుల గురించి ఎక్స్ ఖాతా ద్వారా షేర్ చేసుకుంది. సాయం కోరితే తనను సీఎం సన్నిహితుడు గెస్ట్ హౌస్‌కు రమ్మని పిలిచాడని కె.శోభా రెడ్డి అనే మహిళా వ్యాపారవేత్త వాపోయింది. తాజాగా ఈ ఘటనపై కె.శోభా రెడ్డి మరోసారి నెట్టింట ఓ వీడియో షేర్ చేసింది. నేను చేసిన ట్వీట్ గురించి రకరకాల ఊహాగానాలు లేవనెత్తుతున్నారు. ఆ పార్టీవాళ్లు పెట్టిస్తున్నారా..? ఈ పార్టీవాళ్లు పెట్టిస్తున్నారా..? అని నెగెటివ్‌కామెంట్స్ పెడుతున్నారు. నాకు ఏ పార్టీలతో సంబంధం లేదు. ఒక అమ్మాయి బయటకు వచ్చి ఓ విషయం చెప్పిందంటే.. దాంట్లో ఎంత పారదర్శకత ఉంది.. ఎలా సాయం చేస్తమని చూడండి కానీ పార్టీలతో లింకులు పెట్టడమేంటి..? ఏ పార్టీ వాళ్లు ఏ సమస్య గురించి మాట్లాడొద్దా అని ప్రశ్నించింది. మాట్లాడితే మీరు ప్రతిపక్షం వాళ్లు కాబట్టి కావాలనే మీరిట్లా మాట్లాడుతున్నరని అంటరా..? ఎవ్వరు ఏ పార్టీవాళ్లైనా ఒక సమస్య వచ్చినప్పుడు అందరూ స్పందించాలి. . అందరూ మాట్లాడాలి.. తగిన న్యాయం చేయాలని ఎవరైనా బాధితులు కోరుకుంటరు. నేను అడ్వర్టైజింగ్ ఏజెన్సీ.. నేను పని కోసం చాలా మందిని సంప్రదించా. ఎమ్మెల్యేలు, మంత్రులు అందరినీ కలిశాను. అయితే వాళ్లు ఇది సీఎంకు సంబంధించిన సబ్జెక్టు కదా వెళ్లి ఆయనను కలవండి అన్నారు.

# యూనైటెడ్ రష్యా పార్టీ ఘన విజయం



దిగువ సభకు (స్టేట్ డుమా) జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడు పుతిన్ అనుకూల యునైటెడ్ రష్యా పార్టీ ఘన విజయం సాధించింది. చెప్పుకోదగిన ప్రతిపక్ష పార్టీలు లేకపోవడంతో పుతిన్ పార్టీ విజయం నల్లేరుమీద నడకలా మారింది. ఉక్రెయిన్ యుద్ధం మొదలయ్యాక రష్యాలో ఎన్నికలు జరగడం ఇదే తొలిసారి. రష్యా దిగువ సభలో మొత్తం 450 సీట్లు ఉంటాయి. వీటిలోని సగం సీట్లల్లో పార్టీలు అభ్యర్థులను పోటీలోకి దింపుతాయి. మిగిలిన సగం సీట్లలో (పార్టీ లిస్టు) ప్రజలు నేరుగా పార్టీలనే ఎంచుకుంటారు. పార్టీలకు వచ్చిన ఓట్ల ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది. 5 శాతానికి దిగువ ఓట్లు సాధించిన పార్టీలకు ఎలాంటి సీట్ల కేటాయింపు ఉండదు. రష్యా మీడియా కథనాల ప్రకారం, ఇప్పటివరకూ 90 శాతం ఓట్ల కౌంటింగ్ పూర్తైంది. డుమాలోని మొత్తం సీట్లలో యునైటెడ్ రష్యా పార్టీకి 355 సీట్లు లభించగా కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ రష్యాకు 40 సీట్లు లభించాయి. లిబరల్ డెమోక్రటిక్ పార్టీకి 25 సీట్లు, న్యూపీపుల్ పార్టీకి 20 సీట్లు దక్కాయి. ఈ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ప్రజల మద్దతు పుతిన్‌కు దక్కిందని అధికార పార్టీ ఘనంగా ప్రకటించింది. ఇదిలా ఉంటే, తాజా విజయంతో పుతిన్ మరింత మంది రష్యన్లను సైన్యంలోకి చేర్చుకునే అవకాశం ఉందన్న భయాలు కూడా ఉన్నాయి. పుతిన్ మాత్రం అలాంటి ఆలోచన ఏదీ లేదని స్పష్టం చేశారు. పార్లమెంటు దిగువ సభతో పాటు రష్యాలోని వివిధ ప్రాంతాలు, పుర పాలక సంస్థలు, గవర్నర్ల పరిధిలోని ప్రాంతాలకు ఎన్నికలు జరిగాయి. ముఖ్యంగా పోలింగ్ చివరి రోజున డ్రోన్ దాడులతో ఉక్రెయిన్ విరుచుకుపడింది. అయితే, ఉక్రెయిన్ దాడులను తాము సమర్థవంతంగా తిప్పి కొట్టామని రష్యా రక్షణ శాఖ తెలిపింది.

# బండ్లగూడ ఆర్టీవో ఆఫీసులో ఏసీబీ ఆకస్మిక తనిఖీలు..




హైదరాబాద్, సెప్టెంబర్ 21 బండ్లగూడ ఆర్టీవో ఆఫీసులో ఏసీబీ అధికారులు ఈరోజు (సోమవారం) ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆర్టీవో అధికారులపై ఆయా వాహనదారుల నుంచి పలు ఫిర్యాదులు అందడంతో ఏసీబీ రంగంలోకి దిగినట్లు సమాచారం. తమ దగ్గర సరైన కాగితాలు ఉన్నా ఆర్టీవో కార్యాలయం చుట్టూరా తిప్పుకుంటున్నారని వాహనదారులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే, కానిస్టేబుల్ అరుణ్ కార్యాలయంలోని చాంబర్‌లో నగదు లెక్కిస్తున్న వీడియో దృశ్యాలు రికార్డయ్యాయి. నగదు లెక్కిస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ క్రమంలోనే ఏసీబీ అధికారుల సోదాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆర్టీవో అధికారులను ఏసీబీ బృందం ప్రశ్నిస్తోంది. ఆర్టీవో కార్యాలయంలో గంటకు పైగానే సోదాలు కొనసాగుతున్నాయని సమాచారం. ఏసీబీ అధికారులు ఆయా ఫైళ్లను నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. తనిఖీలు పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

**ముగ్గురు అధికారులపై రవాణా శాఖ కమిషనర్ సస్పెన్షన్ వేటు..**

బండ్లగూడ ఆర్టీవో ఘటనలో ముగ్గురు అధికారులపై రవాణా శాఖ కమిషనర్ సస్పెన్షన్ వేటు వేశారు. వీఎ× భీమ్ సింగ్, ఆర్టీవో రామచందర్, కానిస్టేబుల్ అరుణ్‌లపై చర్యలు తీసుకున్నారు. నగదు లెక్కింపు వీడియో వైరల్ కావడంతో రవాణా శాఖ కమిషనర్ సీరియస్ అయ్యారు. ఏసీబీ సోదాల అనంతరం రవాణా శాఖ ఉన్నతాధికారుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

# ఇటలీ స్కూళ్లలో బుర్కా, నికాబ్‌పై నిషేధం..

**ప్రకటించిన ఇటలీ ప్రధాని జార్జియో మెలోని**



ఇటలీ స్కూళ్లలో విద్యా విధనం విషయంపై ఆ దేశ ప్రధాని జార్జియా మెలోని కీలక నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యంగా విదేశీ విద్యార్థులకు ప్రవేశం విషయంలో సంచలన ప్రతిపాదన చేశారు. దేశంలోని స్కూళ్లలో బుర్కా, నికాబ్ నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇటలీ రాజధాని రోమ్‌లో బ్రదర్స్ ఆఫ్ ఇటలీ పేరుతో జరిగిన పార్టీ కార్యక్రమంలో మెలోని దీనిపై ప్రకటన చేశారు. దీని ప్రకారం విదేశీ విద్యార్థులు ఇటలీ స్కూళ్లలో చదువుకోవాలంటే అక్కడి నిబంధనల్ని పాటించాల్సిందే. విదేశాల నుంచి వచ్చిన వారి పిల్లలు స్కూళ్లలో చదవాలంటే.. వారి తల్లిదండ్రులు ఇటలీ సంస్కృతి, భాషను అర్థం చేసుకోవాలి. ఇందుకోసం పేరెంట్స్ ఇటలీ లాంగ్వేజ్ క్లాసులకు హాజరు కావాలి. ఇదే సమయంలో స్కూళ్లలో విద్యార్థులు బుర్కా, నికాబ్ ధరించడాన్ని నిషేధించబోతున్నారు. ఈ ప్రతిపాదనలు పార్లమెంట్‌లో ఆమోదం పొంది, చట్టంగా మారేందుకు కనీసం 60 రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. ప్రపంచంలోని 24 ముస్లిమేతర దేశాల్లో ఇప్పటికే బుర్కా, నికాబ్‌లపై నిషేధం అమలవుతోంది. చైనా, ఫ్రాన్స్ దేశాలు ఈ నిబంధనను ఎప్పటినుంచో అమలు చేస్తున్నాయి. వచ్చే ఏడాది ఇటలీ పార్లమెంట్‌కు ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె తాజాగా విద్యార్థులకు సంబంధించి మూడు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అవి.. ముఖం కనిపించకుండా చేసే బుర్కా, నికాబ్ వంటివాటిని స్కూళ్లలో నిషేధిస్తారు. ఇవి ఎక్కువగా ముస్లింలు ధరిస్తారు. అయితే, హిజాబ్‌పై మాత్రం ఎలాంటి నిషేధాన్ని ప్రకటించలేదు. అలాగే, విదేశాల నుంచి ఇటలీకి చదువుకోవడానికి వచ్చే విద్యార్థులు ఇటలీ సంస్కృతిని గౌరవించాలి. ఇటలీ భాష నేర్చుకోవాలి. ఇటలీలోని స్కూళ్లు, కాలేజీలలో విదేశీ విద్యార్థుల సంఖ్యకు పరిమితులు విధిస్తారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఇటలీ భాష నేర్చుకోవాలి. ఇక్కడి నిబంధనల్ని తప్పనిసరిగా పాటించాలి. వచ్చే ఏడాది ఎన్నికల్లో విజయం సాధించేందుకు.. ఇటలీ ప్రజల్ని ఆకట్టుకునేందుకు మెలోని ఇలాంటి కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారనే ప్రచారం ఉంది.

# రామ మందిర విరాళాల చోరీ కేసు

అయోధ్య రామ మందిరం విరాళాల చోరీ కేసు విచారణ జరుగుతోంది. ఈ కేసులో ప్రధాన నిందితుల్ని గుర్తించినట్లు సిట్ తెలిపింది. ఈ నెల 25న ఈ కేసుపై చార్జిషీటు దాఖలు చేయనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు సుప్రీంకోర్టులో సోమవారం ఈ కేసుపై విచారణ జరగగా.. స్టేటస్ రిపోర్టును సిట్ సమర్పించింది. అయోధ్య రామ మందిరం విరాళాల చోరీపై ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక విచారణ బృందం (సిట్) ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు సిట్ విచారణను పర్యవేక్షిస్తోంది. ఈ సందర్భంగా సోమవారం ఈ కేసు పురోగతిపై స్టేటస్ రిపోర్టును కోర్టుకు సిట్ వివరించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఈ కేసును విచారిస్తున్నారు. సిట్ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టులో వాదన వినిపించారు.

# కేరూర్ గ్రామం లో ఘనంగా మహా అన్నప్రసాదం రక్తదానశిబిరం

సంగారెడ్డి సెప్టెంబర్ 21వట్ పల్లి మండలం లోని కేరూర్ గ్రామంలో త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. వినాయక మండపం వద్ద ఈ కార్యక్రమం కావడం తో కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఎన్నెన్నో హాస్పటల్ వారి సహకారంతో గ్రామంలో మెడికల్ క్యాంపు మరియు రక్తదాన శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో పాటు సోదరభావంతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. గణేష్ ఉత్సవాలు ప్రజల్లో ఐక్యత, భక్తిభావాన్ని పెంపొందిం చడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలకు వేదికగా నిలుస్తున్నాయని అన్నారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చూసుకుంటామని అన్నారు. అనంతరం నిర్వహించిన మహా అన్నప్రసాద




కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గణనాథుని ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. భక్తుల కోసం అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని, ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో గణనాథుని ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల్, నాగరాజ్, జ్ఞానేశ్వర్, సాయినాథ్ గౌడ్, చరణ్, అభిరామ్, ప్రవీణ్, కుమార్, వంశీ, మహేష్, శ్రీకాంత్, విశాల్, విజయ్, నవీన్ తదితరులు మరియు ఎమ్మెన్నార్ హాస్పటల్ సిబ్బంది గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# జనాభా లెక్కల సేకరణ సందర్భంగా కులగణన కచ్చితంగా చేపట్టాలి

## కులగణన,బీసీల న్యాయమైన హక్కుల కోసం బీఆర్ఎస్ పార్లమెంటులో పోరాడుతుంది: ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

హైదరాబాద్ సెప్టెంబర్ 21
దేశ జనాభాలో అత్యధిక సంఖ్యలో ఉన్న బీసీల ం,బహుజనులు అనాదిగా అన్ని రంగాలలో తీవ్ర అణచివేతకు గురవుతున్నారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ఆవేదన వ్యక్తంచేశారు. జనగణన సందర్భంగా కులగణన కూడా చేపడతామని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రకటించినప్పటికీ, ఆచరణలో మాత్రం ఎటువంటి పురోగతికి నోచుకోకపోవడం శోచనీయమన్నారు. జనాభా లెక్కలతో పాటుగా కులగణన కూడా చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం,బీసీ పొలిటికల్ ఫోరంల ఆధ్వర్యాన సోమవారం అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్ పార్క్ వద్ద వందలాది మంది ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ,బీసీలు,బహుజనుల పట్ల అటు కేంద్రంలో,ఇటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అవలంభిస్తున్న వైఖరిని నిశితంగా విమర్శించారు. దేశంలో బీసీలు 60 శాతానికి పైగా ఉన్నారని,ఎస్సీ, ఎస్టీ,ఆదివాసీలు, మైనారిటీలతో కలిపితే బహుజనులు 85-90 శాతంగా ఉన్నారని చెప్పారు. అయితే, జనాభాలో అత్యధిక సంఖ్యలో ఉన్న బహుజనుల ఓట్లపై ఉన్న శ్రద్ధ రాజ్యాధికారంలో వాళ్లకు సముచిత స్థానం కల్పించడంలో చూపడం లేదని కాంగ్రెస్, బీజేపీలపై ఎంపీ రవిచంద్ర మండిపడ్డారు. ప్రధాని నరేంద్రమోడీ బీసీ అయి ఉండి కూడా బీసీల న్యాయమైన హక్కులను పరిరక్షించడంలో,పరిష్కరించడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 80 ఏళ్లు దాటిన కూడా బీసీల సంక్షేమం,సముద్ధరణకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ లేకపోవడం తీవ్ర బాధాకరం అని ఎంపీ వద్దిరాజు వ్యాఖ్యానించారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో,విద్యా,ఉద్యోగ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న,ఏటా బడ్జెట్లో 20వేల కోట్ల చొప్పున కేటాయిస్తామంటూ ఇచ్చిన హామీలను పాలకులు విస్మరించడం విచారకరమన్నారు. చేతిలో రాజ్యాంగ ప్రతిని పట్టుకుతిరిగే రాహుల్ గాంధీ బీసీ రిజర్వేషన్ల పెంపుదల గురించి కనీసం ఆలోచించడం లేదని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లు పెంచాలంటూ పార్లమెంటులో తాను ప్రవేశపెట్టిన ప్రైవేట్ మెంబర్ బిల్లుకు కాంగ్రెస్ నాయకత్వాన ఉన్న ఇండియా కూటమి మద్దతివ్వలేదని, అధికారంలో ఉన్న బీజేపీ పట్టించుకోవడం లేదని ఎంపీ రవిచంద్ర ఆవేదన వెలిబుచ్చారు. కులగణన చేపడితే బీసీలు,బహుజనుల జనాభా లెక్కలు,80 ఏళ్లుగా వారికి జరుగుతున్న అన్యాయాలు,వాస్తవాలు బయటపడతాయని పాలకులు




భయపడుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. జనాభా లెక్కల సేకరణ సందర్భంగా కులగణన చేపట్టేందుకు గాను ప్రత్యేక క్యూఆర్ కోడ్,కాలమ్ పొందుపర్చాలని,బీసీలకు కేంద్రంలో ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని
, చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలన్న న్యాయమైన డిమాండ్ల సాధనకు తమ పార్టీ బీఆర్ఎస్ పార్లమెంట్ లోపల,బయట తన పోరాటాన్ని కొనసాగిస్తుందని ఎంపీ వద్దిరాజు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వీ.శ్రీనివాస్ గౌడ్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి,ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్ చిరంజీవులు,

పొలిటికల్ ఫోరం చైర్మన్ బాలరాజ్ గౌడ్,సర్పంచుల సంఘం అధ్యక్షుడు యాదయ్య గౌడ్ తదితర ప్రముఖులతో పాటు వందలాది బీసీలు పాల్గొన్నారు.

# కొత్త పింఛన్ల ఎంపిక ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి: రూరల్ ఎమ్మెల్యే.

నిజామాబాద్ నారద సెప్టెంబర్ 21 : కొత్త పింఛన్ల ఎంపిక ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి అధికారులను సూచించారు. అర్హులైన లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో గుర్తించి,ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని నిజామాబాద్ రూరల్,మోపాల్, డిచ్‌పల్లి,జక్రాన్‌పల్లి, ఇందల్వాయి,సిరికొండ,ధర్పల్లి మండలాల ఎంపీడీఓలతో ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త పింఛన్ల ఎంపిక,గృహనిర్మాణం,మండల పరిషత్ కార్యాలయాల పరిస్థితిపై అధికారులతో చర్చించారు.
కొత్త పింఛన్లకు సంబంధించి అర్హత కలిగిన వారిని క్షేత్రస్థాయిలో గుర్తించి ఎంపిక చేయాలని ఎమ్మెల్యే సూచించారు. లబ్ధిదారుల ధృవపత్రాలు, అర్హతలకు సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో పరిశీలించి,వెరిఫికేషన్ సక్రమంగా నిర్వహించాలని అన్నారు. ఎంపిక ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని,లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు.
గృహనిర్మాణానికి సంబంధించి అర్హత ఉన్నప్పటికీ పొరపాటున నా3 జాబితాలో ఉన్న లబ్ధిదారులను గుర్తించి, నిబంధనల ప్రకారం నా1 జాబితాలోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అన్నారు. అర్హులైన పేదలకు గృహ నిర్మాణ ప్రయోజనం అందేలా క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించాలని సూచించారు.



మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయాల (పీఁణూ) పరిస్థితిపైనా సమీక్షలో చర్చించారు.
శిథిలావస్థలో ఉన్న కార్యాలయాలను గుర్తించి అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని, భవనాలు పూర్తిగా అనుకూలంగా లేని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ప్రదేశాలకు కార్యాలయాలను మార్చే అంశాన్ని పరిశీలించాలని ఎమ్మెల్యే సూచించారు.

# మిషన్ భగీరథ లో కాంట్రాక్టర్స్ చేస్తున్న శ్రమ దోపిడి గురించి

**సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో ఫిర్యాదు**

సంగారెడ్డి సెప్టెంబర్ 21 నారద న్యూస్ :- పుల్కల్ మండలం లోని పెద్దారెడ్డి పేట గ్రామ పరిధిలోగల మిషన్ భగీరథ ప్లాంటు నందు రాఘవ, ఎవరెస్ట్, మేఘ మరియు ఎల్ ఒ టి అనే నలుగురి కాంట్రాక్టర్ల ఆధ్వర్యంలో కాంట్రాక్టర్లు శ్రమ దోపిడి జరుగుతుందని అలాగే అందులో పనిచేస్తున్న కాంట్రాక్టర్లను కొద్ది రోజులు పని చేయించుకొని మీరు మాకు అవసరం లేదంటూ తీసేయడం ఎంతవరకు సంజసనీయమని అన్నారు వారిని వెంబడి తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో పెద్దారెడ్డిపేట్ గ్రామ సర్పంచ్ అనసూయ లింగయ్య మరియు కాంగ్రెస్ నాయకులు గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో కలెక్టర్ గారికి వినతి పత్రం అందజేశారు అనంతరం గ్రామ సీనియర్ నాయకులు లింగయ్య మాట్లాడుతూ ఎంప్లాయిస్ ను నియమిస్తు పనులు చేసుకుంటున్నారు. ఈ సంస్థల యజమానులు జిల్లా అధికారులకు తప్పుడు సమాచారం ఇస్తు ఉద్యోగుల నియమాకాలు సాంక్షన్ ప్రకారం కాకుండా తక్కువ మందితో పనిచేయిస్తూ వారి జీతాలను కాంట్రాక్టర్స్ తీసుకొని పై అధికారులకు తప్పుడు లెక్కలు ఇస్తున్నారు. గత నెలలో కలెక్టర్ విజిట్ ఉందని హడివిడిగా సుమారు 20 మందిని తీసుకుని వారికి రెగ్యుల్గా పని చేస్తున్నట్లు మా గ్రామాల యువకులు అటెండెన్స్ చూపిస్తూ అలాగే వేరే ప్లాంట్లనుండి సుమారు 40 మంది యువకులను తుపాన్ వాహనంలో తీసుకొని వచ్చి ప్రత్యక్ష్యంగా కలెక్టర్ గారికి చూయించినారు. అనంతరం గత రెండు నెలల క్రితం నియమించిన ఈ సంస్థలు ఈ నెల 1 తేది నుండి తీసివేసినారు. మా గ్రామ పరిధిలో ఉన్న ఈ మిషన్ భగీరథ ప్లాంట్ ఉంది. కాని మా గ్రామ నిరుద్యోగులకు జీవనోపాధి కల్పించలేక వారి అవసరం కోసం జిల్లా అధికారుల ముందు చూయించి అధికారుల విజిట్ అయిన తరువాత తీసివేయడం పరిపాటి అయ్యింది. ఈ విషయమై గత నెలలో ప్రజావాణిలో



తమరికి మరియు పుల్కల్ మండల తహశీల్దార్ గారికి ఫిర్యాదు చేయడం జరిగింది. వారిని వెంటనే విధులలోకి తీసుకొని మరియు పూర్తి స్థాయి ఉద్యోగులను నియమకాలు జరుపాలని పెద్దారెడ్డీపేట కాంగ్రెస్ నాయకులు మరియు గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమం లో కుమ్మరి అనసూజ లింగయ్య, బసంత్ రావు, నందరి మల్లేశం, ఆకుల యందుల్, నేతి చంద్రశేఖర్, పెదగోళ్ళ సురేష్, చందు తదితరులు పాల్గొన్నారు.

# టోల్ ప్లాజా ప్రాజెక్ట్ మేనేజర్‌ను సన్మానించిన గొంగ్లూర్ గ్రామస్తులు



సంగారెడ్డి సెప్టెంబర్ 21: ఉమ్మడి పుల్కల్ మండలం తాడ్దాన్ పల్లి చౌరస్తా వద్ద ఉన్న టోల్ ప్లాజాలో ద్విచక్ర వాహనాలు వెళ్లే సింగిల్ రోడ్డుపై ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ల కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు, ప్రమాదాలకు గురవుతున్నారని స్థానిక గ్రామస్తులు టోల్ ప్లాజా ప్రాజెక్ట్ మేనేజర్ సుజిత్ కుమార్ చౌదరి దృష్టికి తీసుకెళ్లారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని స్పీడ్ బ్రేకర్లను తొలగించాలని గ్రామస్తులు కోరగా, ప్రాజెక్ట్ మేనేజర్ వెంటనే స్పందించి వాటిని తొలగించారు. సమస్యపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకున్నందుకు కృతజ్ఞతగా పుల్కల్ మండలం గొంగ్లూర్ గ్రామస్తులు సుజిత్ కుమార్ చౌదరిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పల్లె కిష్టయ్య, పుట్టి కిష్టయ్య, ఆలూరి బ్రహ్మానందరెడ్డి, పల్లె చంద్ర కిరణ్, బేగరి సామెల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి

- ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్న జిల్లా ఎస్పీ
- ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారణ
- బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలి
- అధికారులకు పలు సూచనలు చేసిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్



సంగారెడ్డి సెప్టెంబర్ 21 :-జిల్లా ప్రజల సమస్యల సత్వర పరిష్కరానికై సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించిన ఎస్పీ వారితో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విన్నారు. సంబంధిత ఎస్‌హెచ్‌ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి, సమస్య జాప్యానికి గల కారణాలను తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో తమ సమస్యకు పరిష్కారం లభించని పక్షంలో ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వారి సమస్యలకు చట్టపరమైన పరిష్కారం అందించడమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని ఎస్పీ తెలిపారు.

# ఎంజీఎం ఆసుపత్రి భవనం పై పెచ్చులు కూలీ రోగుల ను ప్రాణాపాయ స్థితిలోకి నెట్టిన ఘటన ప్రభుత్వ అసమర్ధతకు నిదర్శనం.



వరంగల్ సెప్టెంబర్ 21 వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ ఆరోగ్యశ్రీ పైకప్పు భవనం కూలి పక్షవాతం వ్యాధితో బాధపడుతున్న పేషంట్లపై పడి రోగులను ప్రాణాపాయ స్థితిలోకి నెట్టడం చాలా తీవ్రమైన అంశంగా వరంగల్ భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సిపిఎం జిల్లా కమిటీ భావిస్తుందని అన్నారు. సోమవారం రోజున ఎసి రెడ్డి నగర్ రఘునాథ్ భవన్ లో సిపిఎం ఖిలా వరంగల్ మండల కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి సిపిఎం కిలా వరంగల్, మండలకమిటీ సభ్యులు, ఎన్ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా, సిపిఎం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ సిహెచ్ రంగయ్య , సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్ రత్నమాల,పాల్గొని మాట్లాడుతూ, ఉత్తర తెలంగాణ జిల్లాలలో అతి పెద్దదైన ఎంజిఎం ,సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ గా ఎన్నిగన్నది. ఈ హాస్పిటల్ కి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అనేక జిల్లాలలో నీ రోగులు వస్తారు. ఆదివారం ఎంజీఎం ఆసుపత్రిలో నీ శిధిలా వస్తలో ఉన్న,ఆరోగ్యశ్రీ వార్డులో భవనం పైకప్పు కూలి పక్షవాతం వ్యాధితో బాధపడుతున్న మస్తాన్, ఎల్లమ్మ, ఓంకార్ అనే ముగ్గురు పేషంట్లపై పడి ప్రాణాపాయ స్థితిలోకి నెట్టడాన్ని ప్రభుత్వ సమర్ధతగా పరిగణించాలన్నారు. ప్రజాప్రతినిధులైన ఎమ్మెల్యేలు ఎంపీలు, ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

# పలు వినాయకుని మండపాలను సందర్శించిన మానాల మోహన్ రెడ్డి..



బాల్కొండ సెప్టెంబర్ 21 : మండలంలో ఇత్వర్ పేట్, జలాల్పూర్, కిసాన్ నగర్,బాల్కొండ గ్రామాలలో వినాయకుడి మండపాలను సందర్శించిన మాజీ డిసిసి అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి.ఇతర పేటలో అంబేద్కర్ యువజన సంఘం వద్ద జలాల్పూర్ లో అంబేద్కర్ యువజన సంఘం వద్ద కిసాన్ నగర్ శివాలయం యూత్ వద్ద బాల్కొండలో ఏబి యూత్,హిందూస్ పవర్ యూత్,మౌౖటెన్ పవర్ యూత్, రైజర్స్ యూత్ ల వద్ద వినాయకుని దర్శించుకోని పూజా కార్యక్రమలు నిర్వహించారు.ఆ విఘ్నేశ్వరుడి ఆశీస్సులు, కృప రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని రైతులందరూ పాడిపంటలతో సంతోషంగా ఉండాలని కోరారు. వినాయకుని మండపల సభ్యులకు వినాయకుని నిమజ్జన సమయంలో తగుజాగ్రత్తలు పాటించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో,బాల్కొండ మండల ప్రెసిడెంట్ ప్రవీణ్, వెంకటేష్ గౌడ్,సర్పంచ్ మోహన్ రెడ్డి,సర్పంచ్ సంతోష్,ప్రవీణ్ గౌడ్, కిషన్,గంగాధర్, సంజీవ్,వాజిద్,రవి,తౌడు గంగాధర్, శ్రీను,కపిల్,నగేష్, యుసిప్,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# గాంధీనగర్ గ్రామ పంచాయతీకి దాత టెంట్ బహుకరణ.

### అడుగుల టెంట్ అందజేసిన దాత బొబ్బల సాంబయ్య



గోవిందరావుపేట మండల పరిది గాంధీనగర్ గ్రామా ని కి చెందిన ధాతబొబ్బల సాంబయ్య 15ఇ30 అడుగుల టెంటు సర్పంచ్ బానోతు నిర్మలవెంకన్న ల కు 15 ఐ 30 అడుగుల టెంట్ బహుకరించారు,
టెంట్ గ్రామ పంచాయతీ ఆధీనంలో ఉంటుందని గ్రామ ప్రజల తమ శు భకార్యాలు, ఇతర అవసరాల కోసం వినియోగించుకోవచ్చని సర్పంచ్ తెలిపారుగ్రామ ప్రజలకు ఉపయోగపడే సేవను అందించిన బొబ్బల సాంబయ్య కుగాంధీనగర్ గ్రామ ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పంచాయతీ పాలకవర్గం సాంబయ్య ను ఘనంగా సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వల్లపు మహేష్, వార్డు సభ్యుడు శంకర్, గ్రామస్తులు బానోతు బాలు, భూక్య సుక్య, లిక్కి మల్లయ్య, లిక్కి నరేష్, చిల్పూర్ శ్రీను, బెల్లి సురేష్ ధరావత్ రాజు, తదితరులు పాల్గొన్నారు,

## బాధ్యతలు చేపట్టిన తాసిల్దారు రవీందర్.



గోవిందరావుపేట, సెప్టెంబర్ 21( నారద) నూతన తాసిల్దారుగా ములుగు ఆర్డీవో కార్యాలయంలో పనిచేసిన కుసుమ రవీందర్ సోమవారం గోవిందరావుపేట తాసిల్దార్ గా బాధ్యతలు చేపట్టడం జరిగింది, గతంలోగోవిందరావుపేట మండల తహసిల్దార్ గా పనిచే నెల్లుట్లసృజన్ కుమార్ రైతు భూమి మార్పిడి పేరుతో లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ ఆయన పట్టుకోవడం జరిగింది, సృజన్ కుమార్ సస్పెండ్ కావడం జరిగింది, ఆయన స్థానంలో రవీందర్ బాధ్యతలు స్వీకరించారు,

# అత్యవసర సమయంలో అండగా సీఎం సహాయనిధి

### - చికిత్స కోసం రూ.5 లక్షల ఎల్ఓసీ అందజేత

### - నిరుపేదలకు కొండంత భరోసా: ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి

నిజామాబాద్, సెప్టెంబర్ 21 ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు అత్యవసర వైద్య చికిత్స సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా నిలుస్తుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి పేర్కొన్నారు.ధర్పల్లి మండలం రేకులపల్లి గ్రామానికి చెందిన లావుడ్యా తరుణ్ అనారోగ్య సమస్యలతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శస్త్రచికిత్సకు సుమారు రూ.5 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు సూచించడంతో బాధిత కుటుంబం ఆర్థిక సహాయం కోసం ఎమ్మెల్యేను సంప్రదించింది.
ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.5 లక్షల వైద్య చికిత్సకు సంబంధించిన ఎల్ఓసీని మంజూరు చేయించగా, స్థానిక సర్పంచ్ రాజేందర్ నేతృత్వంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే భూపతి రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో ఎల్ఓసీ పత్రాన్ని అందజేశారు.
అత్యవసర వైద్య చికిత్స అవసరమైన పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులతో పాటు ఉప



సర్పంచ్ చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# అయోధ్యలో అక్టోబర్ 4, 5 తేదీల్లో ఎన్‌యూజే--ఐ జాతీయ సమావేశాలు

### జర్నలిస్టుల సమస్యలపై దేశవ్యాప్తంగా విస్తృత చర్చ
### పరిష్కారం కోరుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వినతులు







హైదరాబాద్, సెప్టెంబర్ 21: నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) (ఎన్‌యూజే--ఐ) నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంతో పాటు యూనియన్ కౌన్సిల్ సంయుక్త సమావేశాన్ని అక్టోబర్ 4, 5 తేదీల్లో అయోధ్యలో నిర్వహించ నున్నట్లు టీఎస్‌జేయూ రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం నారగౌని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ తోకల, ఎన్‌యూజే--ఐ జాతీయ కార్యదర్శి మెరుగు చంద్రమోహన్ తెలిపారు.

ఈ సమావేశాల్లో దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, వృత్తిపరమైన సవాళ్లు, సంక్షేమం, హక్కులకు సంబంధించిన వివిధ అంశాలపై విస్తృతంగా చర్చించనున్నట్లు పేర్కొన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వంతో పాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు వినతిపత్రాలు సమర్పించే అంశంపై సమావేశాల్లో నిర్ణయాలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.
ఈ జాతీయ సమావేశాలకు ఎన్‌యూజే--ఐ జాతీయ అధ్యక్షుడు సురేష్ శర్మ, జాతీయ ప్రధాన కార్యదర్శి త్రియుగ్ నారాయణ్ తివారీ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు.
తెలంగాణ రాష్ట్రం నుంచి టీఎస్‌జేయూ, ఎన్‌యూజే--ఐ ప్రతినిధులు అధిక సంఖ్యలో అయోధ్య సమావేశాలకు హాజరై విజయవంతం చేయాలని పురుషోత్తం నారగౌని, అనిల్ కుమార్ తోకల, మెరుగు చంద్రమోహన్ కోరారు.

# అంబేడ్కర్ ఆశయాల సాధనకు యువత కంకణబద్ధులు కావాలి

**అంబేడ్కర్ యువజన సంఘం 50వ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు ఘనంగా**

భూపాలపల్లి, సెప్టెంబర్ 21
అంబేద్కర్ యువజన సంఘం 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాలు, మండలాల కమిటీ నాయకులు, కార్యకర్తలు, అంబేద్కర్‌వాదులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.
కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పుల్లా ప్రేమ్ సాగర్ నీలిరంగు జెండాను ఆవిష్కరించి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ యువజన సంఘం ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను గ్రామ గ్రామాన, ప్రతి మండల కేంద్రంలో, జిల్లా కేంద్రాల్లో, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా



నిర్వహించాలని పిలుపునిచ్చారు. జెండాలు ఎగురవేసి, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి గోల్డెన్ జూబ్లీ వేడుకలను నిర్వహించాలని సూచించారు.
సామాజిక సమానత్వం, ప్రజాస్వామ్యం, విద్య, హక్కుల సాధన కోసం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన కృషి, త్యాగాలను దేశ ప్రజలు ఎప్పటికీ మరువలేరని పుల్లా ప్రేమ్ సాగర్ పేర్కొన్నారు. అంబేద్కర్ ఆలోచనలు, ఆశయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.
విశిష్ట అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్లా మల్లయ్య అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. సమాజంలో సామాజిక చైతన్యం పెంపొందించేందుకు యువత ముందుకు రావాలని, ప్రతి పౌరుడు అంబేద్కర్ యువజన సంఘంలో చేరి సంఘం లక్ష్యాల సాధన కోసం కంకణబద్ధులై పనిచేయాలని కోరారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జోగుల రాజు, జిల్లా కోశాధికారి గోగుల మదన్ మోహన్, జిల్లా ప్రచార కార్యదర్శి గుర్రపు రాజేందర్, నియోజకవర్గ ఇన్‌చార్జి అరకొండ రాజయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు జాడి అశోక్, బిడ్డేల పోచయ్య, గట్టయ్య, మారేపల్లి కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకులు బట్టు రవి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మంతెన రాజేష్తో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు హాజరై గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను విజయవంతం చేశారు. కార్యక్రమం సందర్భంగా పలువురు నాయకులు అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# తంపుల ఈశ్వరమ్మ దశదిన కర్మకు హాజరైన బీఆర్ఎస్ నాయకులు

ఐనవోలు, సెప్టెంబర్ 21 బీఆర్ఎస్ పార్టీ ఐనవోలు మండల కన్వీనర్ తంపుల మోహన్ మాతృమూర్తి తంపుల ఈశ్వరమ్మ దశదిన కర్మ కార్యక్రమాన్ని సోమవారం ఐనవోలు మండలంలో నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి పలువురు బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరై ఈశ్వరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.
ఈ సందర్భంగా మాజీ వైస్ చైర్మన్ గజ్జల్లి శ్రీరాములు, యువజన నాయకుడు మరుపట్ల నరేష్, మాజీ సర్పంచ్ రమేష్, మాజీ ఎంపీటీసీ అనిల్ సాగర్ తదితరులు తంపుల మోహన్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈశ్వరమ్మ మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని కోరుతూ, వారికి తమ అండదండలు ఉంటాయని నాయకులు పేర్కొన్నారు.

కార్యక్రమంలో అశోక్, ప్రభాకర్, సుధాకర్, యాకూబ్, సదానందం తదితరులు పాల్గొని



కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## (సంపాదకీయం)

# స్వచ్ఛమైన గాలి అందరి హక్కు

సెప్టెంబర్ 21 గాలి లేకుండా మనిషి కొన్ని నిమిషాలు కూడా జీవించలేడు. నీరు, ఆహారం ఎంత ముఖ్యమో స్వచ్ఛమైన గాలి కూడా అంతే ముఖ్యమైనది. అయితే నేడు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న కాలుష్యం కారణంగా పరిశుభ్రమైన గాలి అందుబాటులో ఉండటం పెద్ద సవాలుగా మారుతోంది. నగరాలు మాత్రమే కాకుండా గ్రామీణ ప్రాంతాలు కూడా వాయు కాలుష్యం ప్రభావాన్ని ఎదుర్కొంటున్నాయి. పారిశ్రామికీకరణ, వాహనాల పెరుగుదల, అటవీ నిర్మూలన, చెత్త దహనం వంటి కారణాల వల్ల గాలి నాణ్యత రోజురోజుకు క్షీణిస్తోంది. ఈ పరిస్థితుల్లో స్వచ్ఛమైన గాలి అనేది కేవలం అవసరం మాత్రమే కాదు, ప్రతి పౌరుడికి ఉండాల్సిన ప్రాథమిక హక్కు అనే భావన బలపడుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలు కూడా వాయు కాలుష్యం మానవ ఆరోగ్యానికి అతిపెద్ద ముప్పులలో ఒకటిగా మారిందని హెచ్చరిస్తున్నాయి. కాలుష్య గాలిని నిరంతరం పీల్చడం వల్ల ఊపిరితిత్తుల వ్యాధులు, గుండె సంబంధిత సమస్యలు, అలర్జీలు, ఆస్తమా వంటి వ్యాధులు పెరుగుతున్నాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. పరిశుభ్రమైన గాలి లేకపోవడం వల్ల ఆరోగ్య రంగంపై అదనపు భారం పడటంతో పాటు కుటుంబాల ఆర్థిక పరిస్థితులపై కూడా ప్రభావం చూపుతోంది. కాబట్టి గాలి కాలుష్యాన్ని కేవలం పర్యావరణ సమస్యగా కాకుండా ప్రజారోగ్య సమస్యగా కూడా చూడాల్సిన అవసరం ఉంది.నగరాల్లో వాహనాల సంఖ్య పెరుగుతున్న కొద్దీ వాయు కాలుష్యం మరింత తీవ్రమవుతోంది. ప్రతి రోజు లక్షలాది వాహనాలు రోడ్లపై తిరగడం వల్ల భారీ మొత్తంలో కార్బన్ ఉద్గారాలు వాతావరణంలోకి విడుదలవుతున్నాయి. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో గాలి నాణ్యత మరింత దిగజారుతోంది. వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించి ప్రజా రవాణా వ్యవస్థలను ఎక్కువగా ఉపయోగించడం ద్వారా కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించే అవకాశం ఉంది. సైకిల్ ప్రయాణాలు, నడక వంటి పర్యావరణ హిత పద్ధతులను ప్రోత్సహించడం కూడా అవసరం. పరిశ్రమలు దేశ ఆర్థికాభివృద్ధికి అవసరమే అయినప్పటికీ వాటి నుంచి వెలువడే కాలుష్యాన్ని నియంత్రించడం అత్యంత ముఖ్యమైన విషయం. పర్యావరణ నిబంధనలను కచ్చితంగా అమలు చేయడం, కాలుష్య నియంత్రణ పరికరాలను వినియోగించడం, హానికర ఉద్గారాలను తగ్గించడం వంటి చర్యలు తప్పనిసరి కావాలి. పరిశ్రమల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండూ సమతుల్యంగా సాగినప్పుడే స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుంది.

చెట్ల సంఖ్య తగ్గిపోవడం కూడా గాలి కాలుష్యానికి ఒక ప్రధాన కారణం. చెట్లు కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి. అందువల్ల చెట్లను కాపాడటం, కొత్త మొక్కలను నాటడం కాలుష్య నియంత్రణలో అత్యంత ప్రభావవంతమైన మార్గం. ప్రతి కుటుంబం, ప్రతి విద్యాసంస్థ, ప్రతి కార్యాలయం మొక్కల పెంపకాన్ని ఒక బాధ్యతగా తీసుకోవాలి. ఒక మొక్క నాటడం చిన్న పని అనిపించినా సమిష్టిగా అది గొప్ప మార్పును తీసుకురాగలదు. గ్రామీణ ప్రాంతాల్లో పంట అవశేషాలను కాల్చడం, పట్టణాల్లో చెత్తను బహిరంగంగా దహనం చేయడం కూడా వాయు కాలుష్యాన్ని పెంచుతున్నాయి. ఈ చర్యల వల్ల విషపూరిత వాయువులు గాలిలో కలుస్తాయి. ప్రజలు ఇలాంటి పద్ధతులను మానుకుని పర్యావరణ హిత వ్యర్థాల నిర్వహణ విధానాలను అవలంబించాలి. స్థానిక సంస్థలు కూడా చెత్త నిర్వహణలో మరింత సమర్థవంతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

కాలుష్య నియంత్రణలో ప్రభుత్వాల పాత్ర ఎంత ముఖ్యమో ప్రజల పాత్ర కూడా అంతే ముఖ్యమైనది. కేవలం చట్టాలు రూపొందించడం ద్వారా సమస్య పరిష్కారం కాదు. ప్రజల్లో బాధ్యతాయుతమైన ప్రవర్తన పెరిగినప్పుడే ఫలితాలు కనిపిస్తాయి. విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సంఘాలు కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. చిన్న చిన్న అలవాట్ల మార్పులు కూడా పెద్ద ఫలితాలను ఇవ్వగలవు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న ఈ కాలంలో పర్యావరణ హిత పరిష్కారాలను విస్తృతంగా వినియోగించాల్సిన అవసరం ఉంది. విద్యుత్ వాహనాలు, పునరుత్పాదక ఇంధన వనరులు, కాలుష్య నియంత్రణ సాంకేతికతలు భవిష్యత్తులో కీలక పాత్ర పోషించనున్నాయి. ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రజలు కలిసి ఈ మార్పులను స్వీకరించినప్పుడు మాత్రమే కాలుష్య సమస్యను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు.

స్వచ్ఛమైన గాలి అనేది విలాసం కాదు, ప్రతి మనిషికి ఉండాల్సిన ప్రాథమిక హక్కు. ఈ హక్కును కాపాడుకోవడం కోసం సమాజంలోని ప్రతి వర్గం తన వంతు బాధ్యతను నిర్వర్తించాలి. నేడు తీసుకునే నిర్ణయాలే రేపటి తరాల జీవన ప్రమాణాలను నిర్ణయిస్తాయి. పరిశుభ్రమైన గాలి, ఆరోగ్యకరమైన జీవనం, సమతుల్యమైన పర్యావరణం కోసం మనందరం కలిసి కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైంది. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, పచ్చని ప్రకృతి, ఆరోగ్యవంతమైన సమాజాన్ని అందించడం మన అందరి బాధ్యత. అభివృద్ధి పేరుతో ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తే దాని మూల్యం మానవజాతి చెల్లించాల్సి వస్తుంది. అందువల్ల కాలుష్య నియంత్రణను ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రజా ఉద్యమంగా మార్చాలి. ప్రతి పౌరుడు చైతన్యవంతంగా వ్యవహరించినప్పుడు మాత్రమే స్వచ్ఛమైన గాలి హక్కు నిజమైన అర్థంలో సాకారం అవుతుంది.

# అంతరిక్ష రంగంలో చైనా దూకుడు..

## 45 గంటల్లో నాలుగు రాకెట్ ప్రయోగాలు..!



అంతరిక్ష రంగంలో చైనా దూకుడు పెంచుతోంది. కేవలం 45 గంటల వ్యవధిలో నాలుగు రాకెట్ల ను విజయవంతంగా ప్రయోగించింది. మూడు వేర్వేరు ప్రయోగ కేంద్రాల నుంచి ఈ ప్రయోగాలు జరిగాయి. సెప్టెంబర్ 15, 16 తేదీల్లో చేపట్టిన ఈ ప్రయోగాల్లో ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రైవేటు కంపెనీల రాకెట్లు కూడా ఉన్నాయి. మొదటి ప్రయోగం సెప్టెంబర్ 15న జియుక్వాన్ ఉపగ్రహ ప్రయోగ కేంద్రం నుంచి జరిగింది.

ల్యాండ్‌స్పేస్ సంస్థకు చెందిన జుక్యూ-2ఈ రాకెట్ 10 ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చింది. క్వియాన్‌ఫాన్ బ్రాడ్‌బ్యాండ్ మెగా శాటిలైట్ నెట్‌వర్క్ కోసం వీటిని పంపారు. ఈ నెట్‌వర్క్‌లో భవిష్యత్తులో దాదాపు 15 వేల ఉపగ్రహాలను ప్రవేశపెట్టాలని చైనా లక్ష్యంగా పెట్టుకుంది. అదేరోజు షాంఘై సముద్ర తీరంలోని మొబైల్ ప్లాట్‌ఫామ్ నుంచి ఒరియెన్‌స్పేస్ గ్రావిటీ-1 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఇది మరో తొమ్మిది క్వియాన్‌ఫాన్ ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చింది.

ఘన ఇంధనంతో పనిచేసే ఈ రాకెట్ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సాలిడ్ ఫ్యూయల్ రాకెట్‌గా గుర్తింపు పొందింది. మూడో ప్రయోగం హైనాన్ దీవిలోని వెన్‌చాంగ్ కేంద్రం నుంచి జరిగింది. ప్రభుత్వ రంగానికి చెందిన లాంగ్ మార్చ్-12 రాకెట్ తొమ్మిది ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపింది. ఇవి సాట్‌నెట్ పేరుతో ఏర్పాటు చేస్తున్న మరో భారీ బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్ కోసం ఉద్దేశించినవి. ఇందులో దాదాపు 13 వేల ఉపగ్రహాలను ప్రవేశపెట్టే ప్రణాళిక ఉంది.

నాలుగో ప్రయోగంతో ఈ వరుస ముగిసింది. జియుక్వాన్ నుంచి కుయ్‌జౌ-11 రాకెట్ రెండు రాడార్ భూ పరిశీలన ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చింది. మొత్తంగా నాలుగు ప్రయోగాల్లో 30 ఉపగ్రహాలను చైనా కక్ష్యలోకి పంపింది. ఈ నాలుగు ప్రయోగాలు చైనా అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థల పాత్ర పెరుగుతున్న విషయాన్ని కూడా చూపించాయి. అయితే ఈ నాలుగు ప్రయోగాల్లో ఏ రాకెట్ బూస్టర్‌ను తిరిగి భూమికి తీసుకురాలేదు. కాగా జుక్యూ-3, లాంగ్ మార్చ్-10 బీ రాకెట్ల తొలి దశలను విజయవంతంగా ల్యాండ్ చేసి పునర్వినియోగ సాంకేతికతలో చైనా ముందడుగు వేసింది.

# హనీమూన్ లాగా బస్సులు వేసుకుని తిరుగుతున్నారు..

## కాంగ్రెస్ ఎంపీలకు భూములు, ఫామ్ హౌస్‌లు లేవా...? : ఎంపీ వద్దిరాజు రవిచంద్ర




జూరాల నీళ్లు అడిగితే బీఆర్ఎస్ నాయకులను నిర్బంధంలో ఉంచారు. జూరాల నీళ్లను ఇవ్వడానికి ప్రభుత్వానికి అభ్యంతరం ఎందుకు ..? కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయమని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు.తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. రైతులు బాధపడుతుంటే ప్రాజెక్టు నిండా నీళ్లు.. రైతుల కండ్లల్లో కన్నీళ్లు.. ఈ బాధను చూడలేక మా బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, వేలాది మంది రైతులు జూరాలను సందర్శించి ఆ నీళ్లను మాకెందుకు వదలరు. మాకు వదిలిపెట్టండి అని మొర పెట్టుకొని ప్రాజెక్టుకు పోదామంటే మా నాయకులను ఎక్కడికక్కడ గృహనిర్బంధం చేస్తారు. అంటే నీళ్లడిగితే నిర్బంధమా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అసమర్థ ప్రభుత్వం నడుస్తోందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని మోసం చేశారు. బీసీలకు మంత్రి పదవుల్లోనూ ప్రాధాన్యత ఇవ్వలేదు. సమైక్య పాలకులకు బుద్ధి చెప్పే విధంగా కేసీఆర్ కరెంటు ఇచ్చారన్నారు. రైతులకు యూరియా ఇచ్చే పరిస్థితి లేదు. 22ఏ అంశంలో రైతులు, బీసీలు ఎక్కువ ఇబ్బంది పడుతున్నారన్నారు. తెలంగాణ కాంగ్రెస్, బీజేపీ చెరో 8 మంది ఎంపీలు ఉన్నారు హనీమూన్ లాగా ఇక్కడ ఎంపీలు బస్సులు వేసుకుని తిరుగుతున్నారు. తెలంగాణ రాష్ట్ర విభజనను ఇండియా,పాకిస్తాన్ విభజనతో పోల్చినా కాంగ్రెస్ ఎంపీలు మాట్లాడలేదు కాంగ్రెస్ ఎంపీలకు భూములు, ఫామ్ హౌస్‌లు లేవా...? జెన్ జీ విద్యార్థులు ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించారు. పోలీసులు అతిగా వ్యవహరించవద్దు. జూరాలలో త్రాగు నీటికి 9 టీఎంసీలు అవసరం లేదు. తాగునీటి అవసరాల పేరుతో పంటలు ఎండబెట్టొద్దు.

గోదావరిలో ఏపీకి నీళ్లను ఎందుకు వదిలిపెడుతున్నారు..మేడిగడ్డ రెండు పిల్లర్లను రిపేర్ చేసే తెలివి ఈ ప్రభుత్వానికి లేకుండా పోయింది.. ఇపుడు కూడా కన్నె పల్లి నుంచి నీళ్లు లిఫ్ట్ చేసే అవకాశమున్నా చేయడం లేదన్నారు. సీజన్ ప్రారంభం లోనే కన్నెపల్లి మోటార్లు ఆన్ చేసి ఉంటే సాగు తాగు నీళ్లకు కొరత ఉండేది కాదన్నారు.

# ఢిల్లీ సెషన్స్ కోర్టులో సోనియా గాంధీకి చుక్కెదురైంది.



ఢిల్లీ సెషన్స్ కోర్టులో కాంగ్రెస్ నేత సోనియా గాంధీకి చుక్కెదురైంది. ఆమె ఓటరు నమోదు వివాదంలో ఢిల్లీ సెషన్స్ కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ దాఖలైన ఫిర్యాదును కొట్టివేస్తూ మేజిస్ట్రేట్ కోర్టు గతంలో ఇచ్చిన ఉత్తర్వులను ప్రత్యేక న్యాయస్థానం రద్దు చేసింది. ఆ ఉత్తర్వులో తగిన కారణాలు లేవని పేర్కొంటూ.. ఫిర్యాదును చట్ట ప్రకారం.. మరోసారి పరిశీలించి, సరైన కారణాలతో కూడిన ఉత్తర్వులివ్వాలని మేజిస్ట్రేట్ కోర్టును ఆదేశించింది.

సోనియా గాంధీ భారత పౌరసత్వం పొందకముందే ఓటరు జాబితాలో ఆమె పేరు నమోదైందని న్యాయవాది వికాస్ త్రిపాఠి తన పిటిషన్‌లో ఆరోపించారు. ఆమె పేరు 1980లోనే ఢిల్లీ ఓటరు లిస్టులో ఉందని పేర్కొన్న ఆయన.. ఆ తర్వాత 1982లో పేరు తొలగించారని, 1983లో మరలా నమోదైందని వాదించారు. కానీ వాస్తవానికి ఆమె.. 1983లో భారత పౌరసత్వం పొందారని పేర్కొన్నారు. కాగా.. ఈ ఫిర్యాదును మేజిస్ట్రేట్ కోర్టు గతంలో తిరస్కరించింది. దీంతో ఆయన సెషన్స్ కోర్టును ఆశ్రయించారు.

ఈ పిటిషన్‌ను విచారించిన ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే.. దిగువ కోర్టు ఉత్తర్వులో ఫిర్యాదులోని ఆరోపణలకు అనుగుణంగా తగిన కారణాలేవీ నమోదవలేదని పేర్కొన్నారు. వీటిపై ఢిల్లీ పోలీసుల నుంచి స్టేటస్ రిపోర్ట్ కోరేందుకు తగిన అవకాశం ఇవ్వకుండానే మేజిస్ట్రేట్ తిరస్కరించిందన్నారు. దీంతో దర్యాప్తు అధికారి స్పందనను పూర్తిగా పరిశీలించకుండానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు న్యాయస్థానం అభిప్రాయపడింది. అందువల్ల ఫిర్యాదును తిరిగి మేజిస్ట్రేట్ కోర్టుకే పంపిస్తూ, ఈ అంశాన్ని కొత్తగా పరిశీలించాలని ఆదేశించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 29కు వాయిదా వేసింది.




## కేకేఆర్ చేతికి మెడికవర్ అంతర్జాతీయ పెట్టుబడుల సంస్థ కేకేఆర్ చేతికి మరో

ప్రస్తుతం మెడికవర్ ఇండియా విలువ 1.2 బిలియన్ల యూరోలు. 2017లో ప్రారంభమైన మెడికవర్ హాస్పిటల్.. దేశవ్యాప్తంగా 24 దవాఖానల్లో 4,800 పడకలను నిర్వహిస్తున్నది. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఈ పెట్టుబడులు పెట్టినట్టు, దీంతో మెడికవర్ ఇండియా డాక్టర్లు, ఉద్యోగులకు మరింత లాభదాయకంగా ఉంటుందని కేకేఆర్ ఇండియా హెడ్ అక్షయ్ తన్నా తెలిపా రు. మెడికవర్ ఇండియాలో 80 క్లినికల్ స్పెషాల్టీలు, 1,900 మంది డాక్టర్లు, అడ్వాన్స్‌డ్ క్లినికల్ మౌలిక సదుపాయాల టెక్నాలజీ ఉన్నది. దేశీయ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థకు దీర్ఘకాలిక అభివృద్ధిపై తమకున్న నమ్మకానికి ఈ పెట్టుబడులు నిదర్శనమన్నారు.

## పొద్దుపోయాక ఫోన్ చేసి వేధించొద్దు..




రుణాల వసూళ్లకు సంబంధించి భారత రిజర్వ్ బ్యాంకు నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. రుణగ్రహీతలకు రికవరీ ఏజెంట్స్ వేధింపుల నుంచి రక్షణ కల్పించేలా నూతన మార్గదర్శకాలు జారీ చేసింది.పొద్దుపోయాక ఫోన్ చేసి వేధించొద్దు.. రుణాల వసూళ్లపై ఆర్బీఐ కొత్త మార్గదర్శకాలు

రుణాల వసూళ్లకు సంబంధించి భారత రిజర్వ్ బ్యాంకు నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. రుణగ్రహీతలకు రికవరీ ఏజెంట్స్ వేధింపుల నుంచి రక్షణ కల్పించేలా నూతన మార్గదర్శకాలు జారీ చేసింది. రికవరీ ఏజెంట్లు, బ్యాంకుల నియమావళికి సంబంధించి పటిష్ఠ నిబంధనలను విడుదల చేసింది. వచ్చే ఏడాది జనవరి 1 నుంచీ ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయని తెలిపింది. లోన్ రికవరీ బాధ్యతను ఇతర సంస్థలకు ఔట్‌సోర్సింగ్ చేసిన సందర్భాల్లో రికవరీ ఏజెంట్ల బాధ్యత రుణదాతలదేనని స్పష్టం చేసింది.

కొత్త మార్గదర్శకాలు ఇవీ..

లోన్ రికవరీ కోసం ఉదయం 8 నుంచి రాత్రి 7 లోపు మాత్రమే రుణగ్రహీతలకు ఏజెంట్స్, బ్యాంకులు ఫోన్ చేయాలి. రుణగ్రహీతల అనుమతి తీసుకున్నాకే నిర్ణీత వేళలను దాటి కాల్ చేయాలి. మెడికల్ ఎమర్జెన్సీలు, వ్యక్తిగతంగా సున్నితమైన సందర్భాల్లో రుణగ్రహీతలను సంప్రదించకూడదు. రుణగ్రహీతలను బెదిరించడం, దుర్భాషలాడటం చేయకూడదు. బహిరంగంగా పరువు తీసే చర్యలకు దిగకూడదు.

సోషల్ మీడియా దుర్వినియోగానికి అడ్డుకట్ట

లోన్ రికవరీ కోసం యూజర్ల సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ను దుర్వినియోగపరచకూడదు. యూజర్ల పరువు తీసేలా వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు, ఆడియో రికార్డింగులను ఆన్‌లైన్‌లో షేర్ చేయకూడదు. లోన్ రికవరీ కోసం తొలిసారి రుణగ్రహీత ఇంటికి వెళ్లేందుకు కనీసం ఒక రోజు ముందే సమాచారం ఇవ్వాలి. రికవరీ ఏజెంట్ వివరాలను బ్యాంకులు ముందుగానే రుణగ్రహీతకు అందించాలి. రుణగ్రహీతలు సూచించిన ప్రదేశంలో వారిని కలిసేందుకు వీలైనంత వరకూ ప్రయత్నించాలి. ప్రత్యేక ప్రదేశాన్ని రుణగ్రహీత నిర్దేశించకపోయినా లేదా చెప్పిన చోటుకు వస్తానని చెప్పి పలుమార్లు మాటతప్పినా నేరుగా ఇంటికి వెళ్లొచ్చు.

# ఖడ్గమృగాల రక్షణకు ప్రపంచ పిలుపు

- అంతరించిపోతున్న జాతుల పరిరక్షణ అవసరం
- అక్రమ వేటతో తగ్గుతున్న ఖడ్గమృగాల సంఖ్య
- జీవ వైవిధ్యానికి ఖడ్గమృగాల ప్రాముఖ్యత
- భవిష్యత్ తరాలకు ప్రకృతి సంపద సంరక్షణ

సెప్టెంబర్ 21 ప్రపంచ ఖడ్గమృగాల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 22న ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారు. భూమిపై అత్యంత పురాతనమైన మరియు విశిష్టమైన అడవి జంతువులలో ఖడ్గమృగాలు ఒకటి. లక్షల సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ జీవులు ప్రస్తుతం అంతరించిపోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. ఖడ్గమృగాల సంరక్షణ అవసరాన్ని ప్రజలకు తెలియజేయడం, వాటి ప్రాముఖ్యతపై అవగాహన పెంచడం, అక్రమ వేటను అరికట్టడం వంటి లక్ష్యాలతో ఈ దినోత్స వాన్ని నిర్వహిస్తున్నారు. ప్రకృతి సమతుల్యతను కాపాడడంలో ఖడ్గమృగాల పాత్ర ఎంతో కీలకమైనదని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రపంచంలో ప్రధానంగా ఐదు రకాల ఖడ్గమృగాలు ఉన్నాయి. భారతీయ ఖడ్గమృగం, జావా ఖడ్గమృగం, సుమత్రా ఖడ్గమృగం, నల్ల ఖడ్గమృగం, తెల్ల ఖడ్గమృగం అనే జాతులు వివిధ దేశాలలో కనిపిస్తాయి. వీటిలో కొన్ని జాతులు తీవ్ర ప్రమాద స్థితిలో ఉన్నాయి. ముఖ్యంగా జావా, సుమత్రా ఖడ్గమృగాల సంఖ్య చాలా తక్కువగా మిగిలి ఉండటంతో వాటి భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకప్పుడు విస్తారంగా కనిపించిన ఖడ్గమృగాలు ఇప్పుడు పరిమిత ప్రాంతాలకు మాత్రమే పరిమితమవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఖడ్గమృగాల సంఖ్య తగ్గడానికి ప్రధాన కారణం అక్రమ వేట. ఖడ్గమృగాల కొమ్ములకు కొన్ని దేశాలలో అధిక డిమాండ్ ఉండటంతో వేటగాళ్లు వాటిని లక్ష్యంగా చేసుకుంటున్నారు. శాస్త్రీయ ఆధారాలు లేకపోయినా కొమ్ములకు ఔషధ గుణాలు ఉన్నాయని కొన్ని ప్రాంతాల్లో నమ్మకం ఉంది. ఈ అపోహల కారణంగా అక్రమ వ్యాపారం పెరిగి ఖడ్గమృగాల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోంది. అనేక దేశాలు కఠిన చట్టాలు అమలు చేస్తున్నప్పటికీ అక్రమ వేట పూర్తిగా నియంత్రణలోకి రావడం లేదు. అడవుల నరికివేత కూడా ఖడ్గమృగాల మనుగడపై ప్రభావం చూపుతోంది. జనాభా పెరుగుదల, వ్యవసాయ విస్తరణ, పారిశ్రామిక అవసరాల కోసం అడవులను నాశనం చేయడం వల్ల వాటి నివాస ప్రాంతాలు క్రమంగా తగ్గిపోతున్నాయి. ఆహారం, నీటి వనరులు తగ్గిపోవడంతో ఖడ్గమృగాలు జీవన పోరాటం చేయాల్సి వస్తోంది. నివాస ప్రాంతాలు చిన్నవిగా మారడం వల్ల జాతుల అభివృద్ధి కూడా దెబ్బతింటోంది. ఖడ్గమృగాలు అడవుల పర్యావరణ వ్యవస్థలో ముఖ్యమైన భాగం. ఇవి గడ్డి, పొదలను తింటూ అడవుల సహజ సమతుల్యతను కాపాడుతాయి. వాటి సంచారం వల్ల కొన్ని మొక్కల



విత్తనాలు ఇతర ప్రాంతాలకు వ్యాపించి కొత్త మొక్కల పెరుగుదలకు దోహదపడతాయి. అందువల్ల ఖడ్గమృగాలను కాపాడటం అంటే కేవలం ఒక జంతువును రక్షించడం మాత్రమే కాదు, మొత్తం పర్యావరణ వ్యవస్థను సంరక్షించడం కూడా అవుతుంది. భారతదేశం ఖడ్గమృగాల సంరక్షణలో విశేష కృషి చేస్తున్న దేశాలలో ఒకటి. ముఖ్యంగా అసోంలోని కాజిరంగా జాతీయ ఉద్యానవనం ప్రపంచంలోనే అత్యధిక ఏక కొమ్ము ఖడ్గమృగాలకు నిలయంగా ఉంది. ప్రభుత్వాలు, అటవీ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి చేపడుతున్న సంరక్షణ చర్యల వల్ల భారతీయ ఖడ్గమృగాల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇది ప్రపంచానికి ఒక ఆదర్శంగా నిలుస్తోంది.

# వాహన రహిత భవిష్యత్తు వైపు ప్రయాణం

- పెరుగుతున్న వాహనాల సంఖ్యతో కాలుష్య ముప్పు
- సైకిల్, నడకతో ఆరోగ్యకర జీవనం
- ప్రజా రవాణా వ్యవస్థల ప్రాధాన్యం
- పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకం

డెస్క్, సెప్టెంబర్ 21 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి) ప్రపంచ వాహన రహిత దినోత్సవం ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 22న ప్రపంచవ్యాప్తంగా నిర్వహించబడుతుంది. వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలనే లక్ష్యంతో ఈ దినోత్సవాన్ని పాటిస్తారు. ఆధునిక జీవనశైలిలో వాహనాలు మన జీవితంలో విడదీయరాని భాగంగా మారిపోయాయి. అయితే వాహనాల సంఖ్య పెరుగుతున్న కొద్దీ వాటి వల్ల ఏర్పడుతున్న సమస్యలు కూడా తీవ్రమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ రవాణా మార్గాలపై ప్రజల్లో అవగాహన పెంచడం, ప్రకృతికి మేలు చేసే ప్రయాణ పద్ధతులను ప్రోత్సహించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం. గత కొన్ని దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా నగరీకరణ వేగంగా పెరిగింది. గ్రామాల నుంచి పట్టణాలకు, పట్టణాల నుంచి మహానగరాలకు జనాభా తరలిపోవడంతో రవాణా అవసరాలు విపరీతంగా పెరిగాయి. ఫలితంగా



కార్లు, మోటార్ సైకిళ్లు, ఇతర వాహనాల వినియోగం భారీ స్థాయిలో పెరిగింది. ప్రతి ఇంట్లో ఒకటి కంటే ఎక్కువ వాహనాలు ఉండటం సాధారణంగా మారింది. దీనివల్ల రోడ్లపై ట్రాఫిక్ రద్దీ పెరిగి ప్రజలు గంటల తరబడి ప్రయాణాల్లోనే గడపాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

వాహనాల నుంచి వెలువడే పొగ వాయు కాలుష్యానికి ప్రధాన కారణాల్లో ఒకటి. కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్లు, ఇతర హానికర వాయువులు వాతావరణంలో కలవడం వల్ల గాలి నాణ్యత క్షీణిస్తోంది. ఈ కాలుష్యం మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నవారు ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆస్తమా, ఊపిరితిత్తుల వ్యాధులు, గుండె సంబంధిత సమస్యలు పెరగడానికి కాలుష్యం ఒక ప్రధాన కారణంగా వైద్య నిపుణులు చెబుతున్నారు. వాయు కాలుష్యంతో పాటు శబ్ద కాలుష్యం కూడా నగర జీవనాన్ని ప్రభావితం చేస్తోంది. నిరంతరం వినిపించే హారన్ శబ్దాలు, భారీ వాహనాల రాకపోకలు ప్రజల మానసిక ప్రశాంతతను దెబ్బతీస్తున్నాయి. అధిక శబ్దం వల్ల ఒత్తిడి, నిద్రలేమి, వినికిడి సమస్యలు వంటి అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వాహన రహిత దినోత్సవం ఈ సమస్యలపై కూడా ప్రజల దృష్టిని ఆకర్షిస్తుంది. ఒకరోజు అయినా వాహనాల వినియోగాన్ని తగ్గించడం ద్వారా ప్రశాంతమైన వాతావరణాన్ని అనుభవించే అవకాశం కలుగుతుంది. చిన్న దూరాల ప్రయాణాలకు నడక లేదా సైకిల్‌ను ఉపయోగించడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. నిత్య జీవితంలో కొంత శారీరక శ్రమ ఉండటం వల్ల శరీర దృఢత్వం పెరుగుతుంది. అధిక బరువు, మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలను నియంత్రించడంలో నడక కీలక పాత్ర పోషిస్తుంది. సైకిల్ తొక్కడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు కండరాలకు వ్యాయామం లభిస్తుంది. అందుకే అనేక దేశాలు సైకిల్ మార్గాలను ప్రత్యేకంగా అభివృద్ధి చేసి ప్రజలను ప్రోత్సహిస్తున్నాయి.

# ఏనుగుల సంరక్షణకు ప్రపంచ సంకల్పం

- ప్రకృతి సంపదలో ఏనుగుల విశిష్ట స్థానం
- నివాస ప్రాంతాల తగ్గుదలతో పెరుగుతున్న ముప్పు
- జీవ వైవిధ్య పరిరక్షణలో కీలక పాత్ర
- భవిష్యత్ తరాలకు అడవి వారసత్వం

డెస్క్, సెప్టెంబర్ 21ప్రపంచ ఏనుగుల ప్రశంసా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 22న నిర్వహిస్తారు. భూమిపై నివసిస్తున్న అతిపెద్ద భూచర జంతువులలో ఏనుగులు ఒకటి. అపారమైన బలం, తెలివితేటలు, సామాజిక జీవన విధానం, ప్రకృతితో మమేకమైన జీవనశైలి కారణంగా ఏనుగులకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ప్రకృతి సమతుల్యతను కాపాడడంలో, అడవుల అభివృద్ధిలో, జీవ వైవిధ్య పరిరక్షణలో ఏనుగుల పాత్ర ఎంతో కీలకమైనది. ఈ ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలియజేయడం, వాటి సంరక్షణపై అవగాహన పెంచడం కోసం ఈ ప్రత్యేక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఏనుగులు వేల సంవత్సరాలుగా మానవ నాగరికతతో అనుబంధం కలిగి ఉన్నాయి. భారతీయ సంస్కృతి, పురాణాలు, సాహిత్యం, కళారూపాలలో ఏనుగులకు విశిష్ట స్థానం ఉంది. అనేక దేవాలయాలు, చారిత్రక నిర్మాణాలు, జానపద కథల్లో ఏనుగులు ప్రధాన పాత్ర పోషించాయి. శక్తికి, జ్ఞానానికి, సంపదకు ప్రతీకగా వాటిని భావిస్తారు. ప్రకృతి ప్రపంచంలోనే కాకుండా సాంస్కృతిక రంగంలో కూడా ఏనుగులు ఒక ప్రత్యేక గుర్తింపును కలిగి ఉన్నాయి.

ప్రపంచంలో ప్రధానంగా ఆసియా ఏనుగులు, ఆఫ్రికా ఏనుగులు అనే రెండు ప్రధాన జాతులు ఉన్నాయి. వీటిలో ఆఫ్రికా ఏనుగులు పరిమాణంలో పెద్దవిగా ఉండగా, ఆసియా ఏనుగులు కొంత చిన్నవిగా ఉంటాయి. భారతదేశం ఆసియా ఏనుగులకు ముఖ్యమైన నివాస ప్రాంతంగా ఉంది. కర్ణాటక, కేరళ, తమిళనాడు, అసోం, ఒడిశా వంటి రాష్ట్రాల్లో గణనీయ సంఖ్యలో ఏనుగులు నివసిస్తున్నాయి. అయినప్పటికీ వాటి సంఖ్య క్రమంగా తగ్గుతుండటం ఆందోళన కలిగించే అంశంగా మారింది. ఏనుగుల మనుగడకు ప్రధాన ముప్పుగా అడవుల నరికివేత మారింది. జనాభా పెరుగుదల, రహదారుల నిర్మాణం, పారిశ్రామిక ప్రాజెక్టులు, వ్యవసాయ విస్తరణ కారణంగా అడవులు క్రమంగా క్షీణిస్తున్నాయి. ఫలితంగా ఏనుగుల సహజ నివాస ప్రాంతాలు చిన్నవిగా మారుతున్నాయి. ఒకప్పుడు స్వేచ్ఛగా సంచరించిన ప్రాంతాల్లో ఇప్పుడు మానవ కార్యకలాపాలు పెరగడంతో అవి కొత్త సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. నివాస ప్రాంతాలు తగ్గడం వల్ల ఆహారం, నీటి కొరత కూడా ఏర్పడుతోంది. మానవ–ఏనుగు ఘర్షణలు కూడా ఇటీవలి కాలంలో పెరుగుతున్నాయి. అడవులు తగ్గిపోవడంతో ఏనుగులు ఆహారం కోసం గ్రామాలు, వ్యవసాయ భూముల వైపు వస్తున్నాయి. దీనివల్ల పంట నష్టం, ఆస్తి నష్టం, కొన్ని సందర్భాల్లో ప్రాణనష్టం కూడా జరుగుతోంది. మరోవైపు మానవుల చర్యల వల్ల ఏనుగులు కూడా ప్రాణాలు కోల్పోతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు శాస్త్రీయ ప్రణాళికలు, ప్రత్యేక రక్షణ మార్గాలు, అవగాహన కార్యక్రమాలు అవసరమవుతున్నాయి. అక్రమ వేట కూడా ఏనుగులకు పెద్ద ప్రమాదంగా ఉంది. ముఖ్యంగా దంతాల కోసం జరిగే వేట



ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది. దంతాలతో తయారుచేసే వస్తువులకు కొన్ని ప్రాంతాల్లో డిమాండ్ ఉండటంతో వేటగాళ్లు ఏనుగులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. దీనిని అరికట్టేందుకు అనేక దేశాలు కఠిన చట్టాలను అమలు చేస్తున్నప్పటికీ అక్రమ వ్యాపారం పూర్తిగా ఆగలేదు. ఏనుగుల రక్షణకు అంతర్జాతీయ సహకారం అత్యంత అవసరంగా మారింది.

ఏనుగులు అడవుల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయి. అవి సంచరించే సమయంలో అనేక మొక్కల విత్తనాలు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వ్యాపిస్తాయి. దీనివల్ల కొత్త మొక్కలు పెరిగి అడవుల విస్తరణకు దోహదపడుతుంది. గుబురుగా పెరిగిన పొదలను తొలగించడం ద్వారా ఇతర జంతువులకు సంచరించే మార్గాలు కూడా ఏర్పడతాయి. అందుకే ఏనుగులను "అడవుల నిర్మాణ శిల్పులు" అని పర్యావరణ నిపుణులు అభివర్ణిస్తారు. భారతదేశం ఏనుగుల సంరక్షణ కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోంది.



## కృతి శెట్టికి పుట్టినరోజు కానుక..

కృతి శెట్టి పుట్టినరోజు సందర్భంగా 'జనవరి 12 విడుదల' చిత్రబృందం ఆమెకు ప్రత్యేక సర్‌ప్రైజ్ ఇచ్చింది. విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సంక్రాంతి వినోదాత్మక చిత్రంలో కృతి శెట్టిని 'దీపు'గా పరిచయం చేస్తూ ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో కృతి శెట్టి సంప్రదాయ హాఫ్ శారీలో కనిపించారు. ఊదా, గులాబీ రంగులతో కూడిన దుస్తుల్లో ఆమె ఎంతో అందంగా దర్శనమిచ్చారు. చారిత్రక కట్టడం బ్యాక్ గ్రౌండ్‌లో కనిపిస్తుండగా.. చిరునవ్వుతో కృతి శెట్టి ఇచ్చిన పోజ్ పోస్టర్‌కు మరింత ఆకర్షణను తీసుకొచ్చింది. ఈ పోస్టర్ ద్వారా ఆమె పోషిస్తున్న పాత్ర చాలా సంప్రదాయబద్ధంగా ఉంటుందని క్లారిటీ వచ్చింది'జనవరి 12 విడుదల' చిత్రానికి అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. విభిన్నమైన టైటిల్‌తో ఇప్పటికే ఈ సినిమా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. 'బావ బామ్మర్ది సౌజన్యంతో' అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్ కూడా సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇటీవల వెంకటేష్, కళ్యాణ్ రామ్‌లతో రూపొందించిన హాస్యభరితమైన వీడియో ద్వారా సినిమా టైటిల్‌ను ప్రకటించారు.ఈ చిత్రంలో కీర్తి సురేష్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు.

# ఆ సీక్రెట్ తెలిసిపోయింది..




కాన్ స్టార్, అల్లు అర్జున్, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబోలో వస్తున్న చిత్రం రాకా . ఈ సినిమా ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. ఇటీవలే ఆట్లీ టీం '37' నంబర్‌తో ఓ పోస్టర్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ నంబర్ వెనుకున్న సీక్రెట్ ఏంటనేది మాత్రం సస్పెన్స్‌లో పెట్టేసి ప్రేక్షకులు, అభిమానుల్లో క్యూరియాసిటీ పెంచేశారు. ఇప్పుడు అట్లీ బర్త్ డే సందర్భంగా ఈ సీక్రెట్ ఏంటో క్లారిటీ ఇచ్చేశారు.రియల్ టైం మోషన్ క్యాప్చర్ టెక్నాలజీని ఉపయోగించి 37 మందిని చిత్రీకరించి.. విజువల్ ఎఫెక్ట్స్‌లో చేసిన ఒక కొత్త ప్రయోగానికి రాకా బృందం గిన్నిస్ వరల్డ్ రికార్డును సాధించింది. గతంలో రియల్ టైంలో మోషన్ క్యాప్చర్ టెక్నాలజీని ఉపయోగించి 19 మందిని చిత్రీకరించిన రికార్డు ఉండగా.. రాకా టీం తాజాగా 37మందితో ఆ రికార్డును అధిగమించింది. అల్లు అర్జున్, అట్లీ ఈ గిన్నీస్ వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికెట్‌ను అందుకుంది. భారతీయ సినిమా చరిత్రలో అరుదైన ఫీట్‌ను నమోదు చేసి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది అట్లీ అండ్ బన్నీ టీం.సన్ పిక్చర్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ మూవీలో దీపికా పదుకొనే, రష్మిక మందన్నా, మృణాళ్ ఠాకూర్, జాన్వీకపూర్‌తోపాటు పలువురు కీలక నటీనటులు మెస్మరైజ్ చేయబోతున్నారు. మొత్తానికి విడుదలకు ముందే గిన్నీస్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ఎక్కి సినిమాపై అంచనాలను అమాంతం పెంచేస్తున్నాడు అట్లీ. మరి ఈసినిమా బాక్సాఫీస్ రికార్డు ఏ స్థాయిలో బద్దలు కొడుతుందనేది చూడాలి.

## నాని 'ది ప్యారడైజ్'కు భారీ హైప్..



। నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ది ప్యారడైజ్'. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ సినిమా ఎట్టకేలకు సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. సెప్టెంబర్ 23 నుంచే తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక ప్రదర్శనలు ప్రారంభం కానున్న నేపథ్యంలో నాని అభిమానుల్లో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. ఇప్పటికే 'ది ప్యారడైజ్' సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. సినిమాకు 'ఏ' సర్టిఫికెట్ రాగా, దాదాపు 2 గంటల 49 నిమిషాల నిడివితో ఈ చిత్రం థియేటర్లలో సందడి చేయనుంది. మరోవైపు సినిమా నుంచి విడుదలైన 'ఆయా షేర్', 'ఏషనాగుల' పాటలు ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. సెప్టెంబర్ 21న హైదరాబాద్‌లో 'ది ప్యారడైజ్' ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించేందుకు చిత్ర బృందం ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.కొత్త సినిమాలు చూడండి
ఈ కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యే అవకాశం ఉందనే వార్తలు ప్రస్తుతం టాలీవుడ్‌లో ఆసక్తిని పెంచుతున్నాయి. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. చిరంజీవి ఈ వేడుకకు హాజరైతే నాని అభిమానులతో పాటు మెగా అభిమానులకు కూడా ఈ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా మారే అవకాశం ఉంది.మరోవైపు నాని ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి తర్వాత పదివేల మంది ఫ్యాన్స్ తో ప్రత్యేక సమావేశం కానున్నారు. దేశ వ్యాప్తంగా నాని ఫ్యాన్స్ ఈ కార్యక్రమానికి రానున్నారని చెబుతుండగా, వారికి వెజ్, నాన్ వెజ్‌తో డెలిషియస్ భోజనం కూడా ఏర్పాటు చేయనున్నారట.
ఈ విషయం తెలిసిన నాని ఫ్యాన్స్ తెగ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.'ది ప్యారడైజ్ విషయంలో చిత్ర బృందం మరో ఆసక్తికర నిర్ణయం తీసుకుంది. ఈ సినిమాకు ప్రత్యేకంగా ట్రైలర్ విడుదల చేయకుండా నేరుగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు నాని గతంలో వెల్లడించారు. కథ, సినిమాలోని కంటెంట్‌పై నమ్మకంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా భారీ చిత్రాలకు ట్రైలర్ ద్వారా మరింత ప్రచారం కల్పిస్తారు.

## టొరంటో అవార్డు గెలుచుకున్న నాగాలాండ్ చిత్రం అంగ్



తేజ రియో మొదటిసారి రూపొందించిన ఫీచర్ ఫిల్మ్ అంగ్ (ఇూజుర్రప్త్ర). నాగాలాండ్ నేపథ్యంగా ఈ సినిమాను తీశారు. తొలి సినిమాతోనే అంతర్జాతీయ అవార్డు అందుకుని శెభాష్ అనిపించుకుంటున్నారు తేజ రియో. ఈ సినిమా టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ప్లాట్‌ఫామ్ అవార్డును గెలుచుకుంది. అంతేకాదు నేరుగా 2027 ఆస్కార్ బరిలో చోటు సంపాదించుకుంది. ఈ ఏడాది ప్లాట్‌ఫామ్ విభాగానికి ఎంపికైన ఏకైక భారతీయ సినిమాగా అంగ్ నిలవడం విశేషం. అయితే ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో భారతదేశం తరఫున 'గోంధల్' సినిమా ఎంపికయ్యింది. గోంధల్ చిత్ర దర్శకుడు సంతోష్ దావ్‌ఖర్ గోవాలో జరిగిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమ దర్శకుడు అవార్డు అందుకున్నారు. కానీ అంగ్ సినిమా నేరుగా ఆస్కార్‌లో నిలిచింది.కొత్త సినిమాలు చూడండి

## 'ఆదర్శ కుటుంబం' నుంచి 'నారాయణమ్మ' ఫస్ట్ సింగిల్ అప్‌డేట్!



ాఖుఝతీంప్త్రు ఖబ్‌బఎఝఎ । విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం' సినిమా నుంచి మేకర్స్ ఒక క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమాలోని మొదటి పాటైన 'నారాయణమ్మ' సాంగ్‌ను సెప్టెంబర్ 22న విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఎస్. థమన్ సంగీతం అందిస్తున్న ఈ పాటపై ప్రేక్షకుల్లో మరియు అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.కొత్త సినిమాలు చూడండఈ చిత్రంలో విక్టరీ వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి, నివేతా థామస్, డింపుల్ హయతి తదితరులు నటిస్తున్నారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ మాస్ అండ్ ఎంటర్‌టైనింగ్ సాంగ్ ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదలవుతోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకుని ఈ సినిమా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

## సుకుమార్ శిష్యులకు 'ద్వితీయ విఘ్నం' టెన్షన్..

**బుచ్చిబాబు తర్వాత శ్రీకాంత్ ఓదెల వంతు!**



టాలీవుడ్‌లో దర్శకుడు సుకుమార్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఆయన వద్ద పనిచేసి దర్శకత్వంలోకి వచ్చిన పలువురు యువ దర్శకులు తమదైన శైలిలో సినిమాలు చేస్తూ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. ముఖ్యంగా సహజత్వం, రా అండ్ రస్టిక్ కథనాలు, బలమైన భావోద్వేగాలతో సినిమాలను తెరకెక్కించడం సుకుమార్ శిష్యుల పనితీరులో కనిపించే అంశాలుగా మారాయి. అయితే తొలి సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న దర్శకులు రెండో సినిమాతో అదే స్థాయిలో మెప్పిస్తారా? అనే చర్చ ఎప్పటి నుంచో సినీ వర్గాల్లో ఉంది.ప్రస్తుతం ఈ చర్చ సుకుమార్ శిష్యులు బుచ్చిబాబు సానా, శ్రీకాంత్ ఓదెల చుట్టూ తిరుగుతోంది. తొలి సినిమాలతో మంచి విజయాలు అందుకున్న ఈ ఇద్దరు దర్శకులు తమ రెండో చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు.బుచ్చిబాబు సానా 'ఉప్పెన' సినిమాతో దర్శకుడిగా పరిచయమయ్యారు. తొలి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకోవడంతో ఆయనకు టాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా 'పెద్ది' అనే భారీ పాన్ ఇండియా చిత్రాన్ని తెరకెక్కించే అవకాశం దక్కింది.భారీ అంచనాల మధ్య విడుదలైన 'పెద్ది'లో రామ్ చరణ్ నటనకు ప్రశంసలు దక్కాయి. అయితే కథనం, కొన్ని పాత్రల రూపకల్పన, నాటకీయత విషయంలో దర్శకుడిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా హీరోయిన్ జాన్వీ కపూర్ పాత్ర విషయంలో సోషల్ మీడియాలో తీవ్ర చర్చ జరిగింది. ఈ అంశంపై బుచ్చిబాబు కూడా స్పందిస్తూ వివరణ ఇచ్చారు.అయితే బాక్సాఫీస్ పరంగా కూడా 'పెద్ది'పై విడుదలకు ముందు ఉన్న భారీ అంచనాలకు అనుగుణంగా ఫలితం రాలేదనే చర్చ జరిగింది.